


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 17-05-2022 సంపుటి: 03 సంచిక: 239 పేజీలు: 4 వెల: రూ 3-00


# వంశ'ధార' ఎత్తిపోతలకు సీఎం గ్రీన్ సిగ్నల్

నేరడి బ్యారేజీ నిర్మాణానికి ప్రయత్నిస్తూనే.. రైతులకు వంశధార పూర్తి ఫలాలు

రూ.189 కోట్లు ఖర్చవుతుందని అంచనా

కాట్రగడ్డ సైడ్ వియర్ నుంచి వచ్చే 1,700 క్యూసెక్కులకు అదనం

వంశధార ప్రాజెక్టు కింద రెండు పంటలకు సాగు నీరు

శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలు సస్యశ్యామలం

అమరావతి: వంశధార నదిపై నేరడి బ్యారేజీ నిర్మాణానికి ప్రయత్నిస్తూనే.. ఆ ప్రాజెక్టు ఫలాలను 2,55,510 ఎకరాల ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో ముందస్తుగా అందించడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుం బిగించారు. గొట్టా బ్యారేజీ నుంచి హిరమండలం రిజర్వాయర్‌లోకి నీటిని తరలించే ఎత్తిపోతల పనులకు ఆమోదం తెలిపారు. గొట్టా బ్యారేజి జల విస్తరణ ప్రాంతం నుంచి వంశధార వరద జలాలను రోజుకు 1,400 క్యూసెక్కులు హిరమండలానికి తరలిస్తారు. దీనికి రూ. 189 కోట్లు ఖర్చవుతుందని జల వనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. హిరమండలం రిజర్వాయర్‌ను నింపడం ద్వారా ఆయకట్టులో రెండు పంటలకు నీళ్లందిస్తారు. తద్వారా వెనుకబడిన



శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలు సస్యశ్యామలమవుతాయి. వంశధారపై నేరడి బ్యారేజీ నిర్మించి చెరో 57.5 టీఎంసీలు వాడుకొనేలా 1961 జూలై 18న ఏపీ, ఒడిశాల మధ్య ఒప్పందం కుదిరింది. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా 2005లో వంశధార స్టేజ్?2, ఫేజ్?2 చేపట్టారు. నేరడి బ్యారేజీ నిర్మించి రోజుకు 8 వేల క్యూసెక్కుల నీటిని 19.05 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే హీరమండలం రిజర్వాయర్‌లోకి తరలించే పనులు చేపట్టారు. దీనిద్వారా కొత్తగా 45 వేల ఎకరాలకు నీళ్లందించడంతోపాటు వంశధార స్టేజ్?1 కింద 2,10,510 ఎకరాలను స్థిరీకరిస్తారు. అయితే, నేరడి బ్యారేజీపై ఒడిశా సుప్రీం కోర్టుకు వెళ్లింది. దానిపై న్యాయపోరాటం చేస్తూనే ప్రాజెక్టు ఫలాలను ముందస్తుగా రైతులకు అందించడానికి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాజెక్టు డిజైన్‌ను మార్చారు. కాట్రగడ్డ వద్ద వంశధారపై 300 మీటర్ల పొడవున సైడ్ వియర్ నిర్మించి 1,700 క్యూసెక్కుల చొప్పున 8 టీఎంసీలను హిరమండలం రిజర్వాయర్‌లోకి తరలించే పనులు చేపట్టారు. 2009 నాటికే ఈ పనులు సింహభాగం పూర్తయ్యాయి. ప్రస్తుతం చివరి దశలో ఉన్నాయి. ఈ క్రమంలోనే వంశధార ట్రిబ్యునల్ తుది నివేదిక ఇచ్చింది. నేరడి బ్యారేజీ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తూ.. వంశధార జలాలను సమంగా (57.5 టీఎంసీల చొప్పున) రెండు రాష్ట్రాలకు పంపిణీ చేసింది. దీన్ని ఒడిశా ప్రభుత్వం సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. ట్రిబ్యునల్ తుది నివేదికను అమలు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీని, కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రిని సీఎం వైఎస్ జగన్ పలుమార్లు కోరారు. ఈ వివాదాన్ని పరిష్కరించుకోవడానికి గతేడాది నవంబర్ 3న ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్‌తో చర్చలు జరిపారు. ఓ వైపు నేరడి బ్యారేజీ నిర్మాణానికి ప్రయత్నిస్తూనే..

ప్రాజెక్టు పూర్తి ఫలాలను ముందస్తుగా అందించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. కాట్రగడ్డ సైడ్ వియర్ ద్వారా చేరే 1,700 క్యూసెక్కులకు అదనంగా గొట్టా బ్యారేజీ నుంచి మరో 1,400 క్యూసెక్కుల వరద జలాలను హిరమండలం రిజర్వాయర్‌లోకి ఎత్తిపోసేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. దీనిద్వారా వంశధారకు వరద ఉన్న రోజుల్లో గొట్టా బ్యారేజీ ద్వారా ఆయకట్టుకు నీటిని అందించి, వరద లేని రోజుల్లో హిరమండలం రిజర్వాయర్ ద్వారా నీరిస్తారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో ఇప్పటికే వంశధార ప్రాజెక్టు కింద రబీ పంటలకు నీళ్లందిస్తున్నారు. హిరమండలం రిజర్వాయర్‌ను నింపడం ద్వారా రెండో పంటకు కూడా పూర్తి స్థాయిలో ఆయకట్టుకు నీళ్లందించనున్నారు.

# చంద్రబాబును దత్తపుత్రుడు ఎందుకు ప్రశ్నించలేదు: సీఎం జగన్



ఏలూరు : చంద్రబాబు హయాంలో రైతులను మోసం చేస్తే దుష్టచతుష్టయం ఎందుకు ప్రశ్నించలేదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దుయ్యబట్టారు. ఇక ప్రశ్నించాల్సిన సమయంలో ప్రశ్నించకుండా చంద్రబాబుపై దత్తపుత్రుడు విపరీతమైె ప్రేమ చూపించాడు. నాడు చంద్రబాబును ఎందుకు ప్రశ్నించలేదని సీఎం మండిపడ్డారు. ఏలూరు జిల్లా గణపవరంలో 'వైఎస్సార్ రైతు భరోసా' కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ, రాజకీయాల గురించి ఆలోచన చేయనని.. ప్రజలకు మంచి చేయాలన్నది తన తపన" అని సీఎం అన్నారు. "ఈ మధ్య రైతుల పరామర్శ యాత్ర అంటూ దత్తపుత్రుడు బయల్దేరాడు. పట్టాదారు పాసు పుస్తకం ఉండి ఆత్మహత్య చేసుకున్న రైతులకు పరిహారం అందని ఒక్కరిని కూడా దత్తపుత్రుడు చూపించలేకపోయాడు. ఇవాళ వీరంతా మొసలి కన్నీరు కారుస్తున్నారు. మన ప్రభుత్వంలో ఎక్కడా లంచాలు లేవు. వివక్ష లేదు. ఓటు వేసినా వేయకపోయినా మంచి చేసే పని జరుగుతోంది. తనకు చంద్రబాబుకు ఉన్న తేడా అదే" అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వ్యవసాయం దండగ అన్ననాయకుడు ఇప్పుడు రైతుల గురించి మాట్లాడుతున్నారు. రైతుల గురించి మాట్లాడే అర్హత చంద్రబాబుకు ఉందా?. రైతుల ఉచిత విద్యుత్, వ్యవసాయం దండగ అన్న నాయకుడు, రైతులపై కాల్పులు జరిపించిన నాయకుడు, రుణాల పేరుతో మోసం చేసిన నాయకుడి పాలనను ఒకసారి గుర్తుచేసుకోండి. గత ప్రభుత్వానికి, మన ప్రభుత్వానికి మధ్య తేడాను ప్రజలు గమనించాలని సీఎం జగన్ కోరారు. 'చంద్రబాబు 2014లో పెట్టిన మేనిఫెస్టోను టీడీపీ వెబ్‌సైట్ నుంచి కూడా తీసేశారు. చెత్తబుట్టలో వేసిన చంద్రబాబుగారి నైజాన్ని చూడండి. ఇవాళ మన ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు అందరూ కూడా ప్రతి ఇంటికీ జగనన్న రాసిన లేఖను అందించి.. ఏం మేలు జరిగిందో చూపిస్తూ, గుర్తుచేస్తూ, మేనిఫెస్టోలో ఏం జరిగిందో టిక్కు పెట్టిస్తున్నారు. మన అందరి ప్రభుత్వానికి, గత ప్రభుత్వానికి తేడా గమనించండని సీఎం జగన్ ప్రజల్ని కోరారు. జగన్ మీ బిడ్డ. రైతుల తరఫున నిలబడే బిడ్డ. ఎన్నికలప్పుడు ఒకలా? ఎన్నికలు అయిన తర్వాత మరో మాదిరిగా ఉండేవాడు కాదు జగన్. మీ బిడ్డకు నిజాయితీ ఉంది.. మీ బిడ్డకు నిబద్ధత ఉంది. ఏది చెబుతాడో... అదే చేస్తాడు. దేవుడు ఆశీస్సులు కావాలి.. మీరు చల్లని దీవెనలు ఇవ్వాలని' సీఎం జగన్ అన్నారు.

# భారత్- నేపాల్ సంబంధాలు మానవాళికి ఉపయోగం : ప్రధాని మోదీ



భారత్- నేపాల్ మధ్య సంబంధాలు చిగురిస్తున్నాయని, ఈ చిగురిస్తున్న సంబంధాలు మానవాళికి ఎంతో ఉపయోగకరంగా వుంటాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో.. ఈ సంబంధాలు ప్రయోజనకారిగా వుంటాయని అభిప్రాయపడ్డారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ సోమవారం నేపాల్ బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా లుంబినీలో జరిగిన బుద్ధ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడారు. బుద్ధ భగవానుడు జన్మించిన స్థలం ఓ అనుభూతిని కలిగిస్తోందన్నారు. 2014 లో తాను నాటిన మహాబోధి చెట్టు ఇప్పుడు పెద్ద వృక్షంగా మారిపోయిందని పేర్కొన్నారు. ప్రేమ, సంస్కృతి, ఇరు దేశాల మధ్య అనాదిగా ఉన్నాయని గుర్తు చేశారు. ఇవన్నీ ఇరు దేశాల మధ్య ఎంత బలపడితే.. బుద్ధ సందేశాన్ని అంత వేగంగా ప్రపంచ వ్యాప్తం చేసినవారమవుతామని అన్నారు. సారా నాథ్, బోధ్‌గయ, ఇండియాలోని ఖుషీన గర్? ఇవన్నీ ఇరు దేశాల మధ్య సహజమైన వారసత్వ సంపద అని అన్నారు. ఇకపై ఇరు దేశాలు కలిసి? వీటిని మరింత విస్తరించాలని మోదీ ఆకాంక్షించారు .బుద్ధుడి బోధనలు ఆలోచనలని, అలాగే ఓ సంస్కారాన్ని కూడా కలిగిస్తాయన్నారు. బుద్ధుడు కేవలం బోధనలు చేసి ఊరుకోలేదని, అవి అనుభూతిలోకి వచ్చేలా తగిన జ్ఞానాన్ని కూడా ఇచ్చారని పేర్కొన్నాడు. బుద్ధుడి జీవితమంతా త్యాగభూతమైనదేనని మోదీ అన్నారు.

# ఆగస్టు 18 తర్వాత అనూహ్య పరిణామాలు.. మీరే చూడండి : ఏపీ మంత్రి



ఏపీ మంత్రి ఆదిమూలపు సురేశ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆగస్టు 15 తర్వాత ఏపీలో ఊహించని పరిణామాలు రాబోతున్నాయని వెల్లడించారు. ఏం జరగబోతోంది? అన్న విషయాన్ని మీరే చూడబోతున్నారంటూ పజిల్ పెట్టారు. తమ ప్రభుత్వం ఏదైనా అనుకుంటే.. దానిని చేసి తీరుతుందని స్పష్టం చేశారు. మూడు రాజధానుల్లో భాగంగా.. కర్నూలుకు జ్యూడీషియల్ కేపిటల్ వచ్చేసిందన్నారు. అయితే ఈ విషయాన్ని ఇప్పుడు అధికారికంగా చెప్పకూడదని, కానీ చెప్పేస్తున్నానని మంత్రి వెల్లడించారు. ఏపీ టౌన్‌ప్లానింగ్‌లో విపరీతమైన అవినీతి వుందని, ఏసీబీ కేసుల ఫైల్స్ చూస్తే, ఈ కేసులే ఎక్కువ అని వెల్లడించారు. గత ప్రభుత్వం అమరావతి చుట్టూ గ్రాఫిక్స్ చేసిందని, అమరావతి చుట్టూ ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడిందని మంత్రి ఆరోపించారు. అందుకే వికేంద్రీకరణ పేరుతో తాము అన్ని ప్రాంతాలకు సమ న్యాయం చేయడానికి నడుం కట్టామని పేర్కొన్నారు.

# అమెరికాలో మరోసారి కాల్పుల కలకలం..

## ముగ్గురు మృతి

అమెరికాలో మరోసారి కాల్పుల మోత మోగింది. న్యూయార్క్‌లోని బఫెలో ప్రాంతంలో చోటు చేసుకున్న కాల్పుల ఘటన మరవక ముందే మరో రెండు ప్రాంతాల్లో కాల్పులు కలకలం రేపుతున్నాయి. అమెరికాలోని హ్యూస్టన్ మార్కెట్‌లో ఓ దుండగుడు కాల్పులు జరపడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. బహిరంగ మార్కెట్‌లో కాల్పులు జరిగినట్లు పోలీసులు తెలిపారు. అయితే రెండు గ్రూపుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణ వాతావరణమే కాల్పులకు దారి తీసిందని పేర్కొన్నారు. ఈ కాల్పుల ఘటనకు సంబంధించి ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని, వారిద్దరి నుంచి రెండు తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కాల్పులు జరిపినవారు, గాయపడ్డవారు అందరూ 20 ఏండ్లలోపు వారని పోలీసులు తెలిపారు. దక్షిణ కాలిఫోర్నియాలోని ఓ చర్చిలో దుండగుడు జరిపిన కాల్పుల్లో



ఒకరు మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ కాల్పుల ఘటన కేసులో ఓ అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అమెరికాలో 18 ఏండ్ల శ్వేత జాతి యువకుడు నల్లజాతీయులపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 10 మంది చనిపోగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘోరానికి పాల్పడుతున్న సమయంలో నిందితుడు లైవ్ స్ట్రీమింగ్ చేసినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. న్యూయార్క్‌లోని బఫెలో ప్రాంతంలోని ఓ సూపర్ మార్కెట్‌లో ఈ దారుణం జరిగింది. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

# ఏపీ బీజేపీకి ఝలక్.. గుడ్‌బై చెప్పిన రావెల కిశోర్ బాబు

ఏపీ మాజీ మంత్రి, బీజేపీ నేత రావెల కిశోర్ బాబు సంచలన నిర్ణయం తీసుకున్నారు. బీజేపీకి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. ఈ రాజీనామా లేఖను ఏపీ బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సోము వీర్రాజుకు పంపించారు. తన వ్యక్తిగత కారణాలతోనే బీజేపీని వీడుతున్నానని, పార్టీ నేతలు అన్యథా భావించవద్దని ఆయన తన రాజీనామా లేఖలో విజ్ఞప్తి చేశారు. ఏపీ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉన్న రావెల? కొన్ని నెలల నుంచి ఆయన పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా లేరు. కిశోర్ బాబు ఐఆర్ ఎస్ అధికారిగా పనిచేశారు. 2014 లో టీడీపీలో చేరారు. ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. గెలుపొందారు. గెలవడమే ఆలస్యం? మంత్రి పదవి కూడా లభించింది. చంద్రబాబు కేబినెట్‌లో సాంఘిక, గిరిజన మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత జరిగిన కేబినెట్ విస్తరణలో మంత్రి పదవి పోయింది. 2019 ఎన్నికల సమయంలో టీడీపీకి గుడ్ బై చెప్పేసి, పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేనలో చేరారు. సారి కూడా ప్రత్తిపాడు నుంచే జనసేన పక్షాన బరిలోకి దిగారు. ఈ ఎన్నికల్లో ఓడిపోయారు. మళ్లీ? సంచలన నిర్ణయం తీసుకున్నారు. బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. బీజేపీలో చేరారు. కొన్ని రోజులు ఉన్నారు. ఇప్పుడు బీజేపీకి రాజీనామా చేసేశారు.



# ప్రజా తిరుగుబాటుతో ఆందోళనలో వైసీపీ నేతలు: లోకేష్

అమరావతి: గ్రామ గ్రామాన వైసీపీ నేతలను ప్రజలు అడ్డుకుంటున్నారని టీడీపీ నేత నారా లోకేష్ మండిపడ్డారు. జగన్ బాదుడే బాదుడు తట్టుకోలేని జనం వైసీపీ నేతలను నిలదీస్తున్నారని మండిపడ్డారు. ప్రజా తిరుగుబాటుతో ఆందోళనలో వైసీపీ నేతలు ఉన్నారని చెప్పారు. సీఎం జగన్ కూడా అధికారుల రక్షణతోనే బయటకు వస్తున్నారని లోకేష్ పేర్కొన్నారు. ప్రజా వ్యతిరేకత ఎలా ఉందో జగన్ సర్కార్?కు అర్థమవుతోందన్నారు.

# కుప్పంలో దాడుల సంస్కృతి దురదృష్టకరం: చంద్రబాబు



అమరావతి: కుప్పంలో హోటల్‌పై వైకాపా కౌన్సిలర్ల దాడిని తెదేపా అధినేత చంద్రబాబు ఖండించారు. కుప్పంలో దాడుల సంస్కృతిని వైకాపా తీసుకురావడం దురదృష్టకరమన్నారు. హోటల్‌లో ఫర్నీచర్ ధ్వంసం చేసి మహిళలను బెదిరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడి ఘటనపై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తెదేపా అండగా ఉంటుందని చంద్రబాబు ట్విటర్ వేదికగా భరోసా ఇచ్చారు. కుప్పం పట్టణం బైపాస్ మార్గంలోని ఓ దాబాలో వైకాపా నాయకులు వీరంగం సృష్టించిన సీసీ ఫుటేజీ వీడియో ఆదివారం సామాజిక మాధ్యమాల్లో వైరలైంది.

# సంపాదకీయం

మంగళవారం 17-05-2022

## గాడిన పడుతున్న ఆర్థిక రంగం

గత ఏప్రిల్‌లో రూ. 1.39 లక్షల కోట్లు. ఈ ఏడాది మార్చిలో 1.42 లక్షల కోట్లు. ఇక, ఈ ఏప్రిల్‌లో ఆల్‌టైమ్ రికార్డ్ 1.68 లక్షల కోట్లు! ఇవన్నీ ఎప్పటికప్పుడు దేశ ఖజానాకు భారీగా చేరుతున్న 'వస్తు, సేవల పన్ను' (జీఎస్టీ) రికార్డ్ స్థాయి వసూళ్ళ గణాంకాలు! ఇటీవలి విదేశీ పర్యటన సహా ప్రతిచోటా ప్రధాని ఛాతీ విరుచుకొని చెబుతున్న ఈ లెక్కలు కరోనా దెబ్బ నుంచి కోలుకుంటున్న మన దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రతిబింబాలు. ఉక్రెయిన్ సంక్షోభంతో చిక్కులు తలెత్తినా, ఆర్థిక కార్యకలాపాలు చురుకుగా సాగుతున్నాయన్న ఈ సూచన కచ్చితంగా ఆరోగ్యకరమే! జీఎస్టీ అమలు ఆరంభమైన నాటి నుంచి ఎన్నడూ లేనంతటి, ఈ తాజా ఏప్రిల్ వసూళ్ళ అద్భుతం రాష్ట్ర ప్రభుత్వాల కృషి, సహకారంతోనే సాధ్యమైందని కేంద్ర ఆర్థిక మంత్రి సైతం బాహాటంగా కొనియాడారు. మంచిదే! మరి పెరుగుతున్న స్థాయికి తగ్గట్టు రాష్ట్రాలకి న్యాయంగా చేరాల్సిన పైసా వంతు చేరుతోందా? వ్యాపారాలపై కేంద్రం, రాష్ట్రాలు విధించే బహుళ పన్నులను తప్పించి, సరళీకృత ఒకే పన్ను వ్యవస్థ ఉండాలనే ఉద్దేశంతో జీఎస్టీ తెచ్చారు. 2017 జూలై 1 నుంచి అది అమలవుతోంది. దేశమంతటా జీఎస్టీని వర్తింపజేస్తున్నప్పుడు రాష్ట్రాలు అనేక పన్ను అధికారాలను వదులుకొని, ఆదాయాన్ని నష్టపోవాల్సి వచ్చింది. అందుకే, అయిదేళ్ళ పాటు, అంటే ఈ 2022 జూన్ ఆఖరు వరకు రాష్ట్రాలకు నష్టం లేకుండా లోటు భర్తీ చేయడానికి కేంద్రం అంగీకరించింది. 2015?16ను ప్రాతిపదిక వత్సరంగా తీసుకొని, ఏటేటా 14 శాతం మేర ఆదాయం పెరుగుతుందనే లెక్కన సురక్షిత పరిహారం అందిస్తామని చెప్పింది. అయితే, జీఎస్టీతో అధిక ఆదాయం సమకూరుతున్నా, కేంద్రం అందుకు తగ్గట్టుగా రాష్ట్రాలకు వాటా పంచుతోందా? పైపెచ్చు, ఆదాయ వనరులు పడిపోతున్న రాష్ట్రాలు పదే పదే అభ్యర్థిస్తున్నా, తాము జీఎస్టీ పరిహారమిచ్చే కాలాన్ని అయిదేళ్ళ తర్వాత పెంచేది లేదని కేంద్రం భీష్మించుకుంది. ఫెడరల్ వ్యవస్థలో ఇది ఎంతవరకు సమంజసం? చమురు ఉత్పత్తులపై పన్నులను కేంద్రం తగ్గించినా సరే, బీజేపీ పాలనలో లేని పలు రాష్ట్రాలు మాత్రం తగ్గించనే లేదని ప్రధాని మోదీ గత వారం పేర్కొన్నారు. రాష్ట్రాలతో కోవిడ్ సమీక్ష పెట్టి, సందర్భం లేని ఈ పన్నుల ప్రస్తావన తేవడాన్ని పలు రాష్ట్రాలు ప్రశ్నించాయి. మరీ ముఖ్యంగా జీఎస్టీని అమలు చేస్తే అయిదేళ్ళ పాటు కేంద్రం ఇస్తానన్న పరిహారంతో సహా అనేక చెల్లింపులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయన్నాయి. ఉదాహరణకు ఒక్క పశ్చిమ బెంగాల్‌కే రూ. 97 వేల కోట్లు బాకీ. అందుకే, తాము చమురు పన్నులను తగ్గించలేకపోతున్నామని రాష్ట్రాల వాదన. 2021?22కు గాను గత డిసెంబర్ నుంచి 4 నెలలకు రూ. 78,704 కోట్ల మేర రాష్ట్రాలకు చెల్లించాల్సిన జీఎస్టీ పరిహారం పేరుకుపోయిన మాటను కేంద్ర ఆర్థిక శాఖ సైతం అంగీకరించడం గమనార్హం. కానీ, 'పరిహార సెస్ వసూళ్ళ నిధి'లో 'తగినంత నిల్వ లేకపోవడం' వల్లనే చెల్లింపులు జరపలేకపోతున్నామని తప్పు అటు నెట్టేస్తోంది. జీఎస్టీ వసూళ్ళకు తగ్గట్టు పరిహార సెస్ వసూళ్ళు వేగంగా పెరగడం లేదన్నది నిజమే. కాగా, ఏప్రిల్ నుంచి జూన్ వరకు పోగుపడేవి మరో 60 వేల కోట్లుంటాయని ఆర్థిక శాస్త్రవేత్తల అంచనా. అంటే, రాష్ట్రాలకు 1.4 లక్షల కోట్లు కేంద్రం చెల్లించాల్సి వస్తుంది. జీఎస్టీ మొదలైననాటి నుంచి ఇప్పటి దాకా పరిహారంగా రాష్ట్రాలకు కేంద్రం రూ. 7.35 లక్షల కోట్లు ఇచ్చినట్టు లెక్క. అయితే, సంక్షేమ, అభివృద్ధి ఫలాలను స్థానికంగా ప్రజలకు అందించే బాధ్యత ప్రాథమికంగా రాష్ట్రాలది. ఆ రాష్ట్రాలకు రాబడిలో తగిన వాటా కేంద్రం ఇస్తేనే కదా పురోగతి సాగేది. ఇవ్వకపోతే ఏం చేయాలి? ఈ పరిస్థితుల్లో రాష్ట్రాలకు ఆదాయం కావాలంటే, జీఎస్టీ పన్నులను పెంచడం వినా జీఎస్టీ కౌన్సిల్‌కు మరో దోవ లేకుండా పోతుంది. గత సెప్టెంబర్ తర్వాత సక్రమంగా కలవని కౌన్సిల్ సత్వరమే సమావేశమైతే మంచిది. జీఎస్టీలో 5, 12, 18, 28 శాతా లంటూ 4 శ్లాబులున్నాయి. 5 శాతం శ్లాబ్‌లో ప్రధానంగా ప్యాకేజ్డ్ ఆహారపదార్థాలున్నాయి. ఈ శ్లాబ్‌లో హెచ్చించే ప్రతి 1 శాతం పన్ను వల్ల ఏటా రూ. 50 వేల కోట్లు అదనపు ఆదాయం వస్తుంది. అందుకని 5 శాతం శ్లాబ్‌ను ఎత్తేసి, ఆ పరిధిలోని అధిక భాగం వస్తువుల్ని కొత్త 8 శాతం శ్లాబ్‌కి తెస్తారట. అలా భారం వేసే కన్నా, భారీ జీఎస్టీ వసూళ్ళ దృష్ట్యా వాటిని మెరుగైన రీతిలో పంచే యోచన, రాష్ట్రాలకు పరిహారమిచ్చే కాలాన్ని పొడిగించే ఆలోచన కేంద్రం ఎందుకు చేయకూడదు? జీఎస్టీ లాంటి పరోక్ష పన్నులను ధనిక, పేద తేడా లేకుండా అందరూ ఒకే రేటున కట్టాలి. అదే ప్రత్యక్షపన్నులైతే వారి ఆదాయం, లాభాల స్థాయిని బట్టి కట్టవచ్చు. పన్ను వసూలు వ్యవస్థలోని ఈ అసమానతలు నేటికీ అపరిష్కృతంగానే ఉన్నాయి. ఇప్పటికైనా జీఎస్టీ రేట్లను హేతుబద్ధీకరించాలి. ఉన్నత శ్రేణి వినియోగ వస్తువులకే అధిక శాతం పన్ను శ్లాబ్‌ను వర్తింపజేయడం లాంటి చర్యలు అవసరమనేది అందుకే! అలాగే, వేగవంతమైన వృద్ధికి కీలకమైన మూలధన వ్యయాన్ని రాష్ట్రాలు ఈ ఏడాది బాగా పెంచాలి. కేంద్రం నిధులను త్వరగా విడుదల చేస్తేనే అది సాధ్యం. ఆ నిధులు ఇతర పన్నుల్లోని వాటా కానివ్వండి, జీఎస్టీ పరిహారం కానివ్వండి. ఈ మార్చి, ఏప్రిల్‌లలో వచ్చిన రికార్డు జీఎస్టీ వసూళ్ళలో రాష్ట్రాలకు అధిక వాటా దక్కితే మేలు. కోవిడ్ ఉత్పత్తి నష్టాల నుంచి కోలుకోవ డానికి 12 ఏళ్ళ పైనే పడుతుందని రిజర్వ్ బ్యాంక్ చెబుతున్న వేళ, సమయానికి తగ్గట్టు తోడ్పాటు నిస్తేనే రాష్ట్రాలు ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల ప్రాజెక్టులకు ప్రణాళిక వేసుకొని, వేగంగా ఆచరణలోకి తేగలగుతాయి.

# పీహెచ్ సీల్లో 24 గంటల సేవలు

ఏలూరు, మే 16, ప్రాఆరోగ్య కేంద్రాలు. గ్రామీణ, పేద ప్రజలకు అందుబాటులో ఉండే పీహెచ్‌సీలు నాణ్యమైన సేవలందించడం చరిత్రలో ఇదే తొలిసారి. అదీ ఇరవై నాలుగ్గంటలూ వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి పేదలకు సేవలందిస్తున్నారు. ఇది గతానికి భిన్నం. గతంలో పీహెచ్‌సీ అంటే గ్రామీణ, పేద ప్రజలకు చేరువలో ఉన్నవైనప్పటికీ, సేవల్లో మాత్రం నాసిరకం. వైద్యులు, సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉండే వారు కాదు.ఆసుపత్రి పరిసరాలు కాసేపు నిలబడటానికి కూడా దుర్లభంగా ఉండే పరిస్థితి. ప్రస్తుతం ఆసుపత్రిలో మంచి వాతావరణం కల్పించింది. ఇరవై నాలుగ్గంటలూ ప్రజలకు వైద్య సేవలందిస్తోంది. రాష్ట్రంలోని అన్ని పీహెచ్‌సీలలో మారిన ఈ దృశ్యాన్ని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ విడుదల చేసిన నివేదిక 'రూరల్ హెల్త్ స్టాటిస్టిక్స్(ఆర్‌హెచ్‌ఎస్) 2020?21' కళ్లకు కట్టింది. మరో రెండు చిన్న రాష్ట్రాలు మినహా దేశంలోని ఏ ఇతర రాష్ట్రంలోనూ ఈ విధమైన సేవలు అందడంలేదని వెల్లడించింది. ఆ నివేదిక సారాంశమిదీ..ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 1,142 పీహెచ్‌సీలు వంద శాతం 24/7 పని చేస్తున్నాయి. 99.3 శాతం పీహెచ్‌సీల్లో లేబర్ రూమ్ సౌకర్యం ఉంది. 98.9 శాతం పీహెచ్‌సీల్లో ఆపరేషన్ థియేటర్ ఉంది. కనీసం 4 పడకలున్నవి 98.1%. వీటిలో వసతులకూ కొరత లేదు. 2021 మార్చి నాటికి సిక్కిం, అండమాన్ నికోబార్ వంటి చిన్న రాష్ట్రాల్లో మాత్రమే వంద శాతం పీహెచ్‌సీలు 24/7 పనిచేస్తున్నాయి.దక్షిణాదిలోని తెలంగాణలో 49.4%, కర్ణాటకలో 41.1, తమిళనాడులో 92.5%, కేరళలో 81.7% పీహెచ్‌సీలు మాత్రమే 24/7 సేవలు అందిస్తున్నాయి. పీహెచ్‌సీల్లో వంద శాతం కంప్యూటర్ సౌకర్యం కల్పించిన జాబితాలో ఏపీ, గోవా, సిక్కిం, రాజస్తాన్, తెలంగాణ ఉన్నాయి. అదే విధంగా రాష్ట్రంలోని 141 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో (సీహెచ్‌సీలలో) కనీసం 30 పడకలు, లేబొరేటరీ, వినియోగంలో ఉన్న ఆపరేషన్ థియేటర్లు, లేబర్ రూమ్, న్యూ బార్న్ కేర్ యూనిట్, రెఫరల్ ట్రాన్స్‌పోర్ట్, సాధారణ అనారోగ్యాలకు అల్లోపతిక్ మందులు ఉన్నాయి. అన్ని సీహెచ్‌సీ, పీహెచ్‌సీలలో స్త్రీ, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్ల సౌకర్యం ఉంది.2019?20తో పోలిస్తే పీహెచ్‌సీలలో వైద్యుల సంఖ్యా పెరిగింది. 1,142 పీహెచ్‌సీల్లో 2019?20లో 1,798 మంది వైద్యులు ఉండగా.. 2020?21లో వైద్యుల సంఖ్య 2,001కి పెరిగింది. అదే విధంగా 141 కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లలో 2020లో స్పెషలిస్ట్ వైద్యులు 315 మంది ఉండగా 2021లో 322కు చేరారు.గిరిజన ప్రాంతాల్లో కూడా ప్రాథమిక వైద్య సేవలు నిరంతరం అందుతున్నాయి. రాష్ట్రంలో గిరిజన జనాభా 22.58 లక్షలుగా ఉంది. వీరి కోసం గిరిజన ప్రాంతాల్లో 752 వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ అవసరం కాగా 822 ఉన్నాయి. 112 పీహెచ్‌సీలు ఉండాలి. కానీ అంతకంటే ఎక్కువగా 159 ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో 1,593 మంది ఏఎన్ఎంలు, పీహెచ్‌సీల్లో 278 మంది పని చేస్తున్నట్లు నివేదిక వెల్లడించింది.మాత, శిశు మరణాల కట్టడికి సర్కార్ తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. శిశు మరణాల రేటు (ఐఎంఆర్)లో దేశ సగటుకన్నా రాష్ట్ర సగటు తక్కువగా ఉంది. జాతీయ స్థాయిలో ప్రతి వెయ్యి జననాలకు సగటున 30 శిశు మరణాలు నమోదవుతున్నాయి. రాష్ట్రంలో 25 మరణాలు ఉంటున్నాయి. జాతీయ స్థాయిలో గ్రామీణ ప్రాంతాల్లో 34 మరణాలు ఉండగా రాష్ట్రంలో 28గా ఉంది. జాతీయ స్థాయిలో పట్టణ ప్రాంతాల్లో 20గా ఉండగా రాష్ట్రంలో 19గా ఆ నివేదిక పేర్కొంది.

# అసని తో రైతులు విలవిల



శ్రీకాకుళం, మే 16, తీర ప్రాంతాల్లో అసని తుపాను కల్లోలం సృష్టించింది. వందల ఎకరాల్లో పంటలు ధ్వంసం అయ్యాయి. మచిలీపట్నానికి 20 కిలో మీటర్లు, నర్సాపురానికి 40 కిలోమీటర్ల మధ్య కొద్ది రోజుల తీరం దాటిన 'అసని' ప్రభావంతో జిల్లాల్లో కోట్లాది రూపాయల విలువైన వరి, అరటి, మామిడి, జీడిమామిడి, బొప్పాయి, కొబ్బరి, నిమ్మ, మొక్కజొన్న, వేరుశనగ పంటలు నేల మట్టం అయ్యాయి. ఉద్యానవన పంటలకూ తీవ్ర నష్టం వాటిల్లింది. అయినా జగన్ సర్కార్ తుపాను సమయంలో ఏమాత్రం సహాయక చర్యలు నిర్వహించలేదనే ఆరోపణలు సర్వత్రా వినవస్తున్నాయి.అసని తుపాను వెళ్లిపోయినా ప్రభుత్వ యంత్రాంగం ఇంకా పంట, ఆస్తి నష్టాలను అంచనా వేయడానికి, సహాయం చేయడానికి రావడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుపాను, వరదల కారణంగా జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసి, వెంటనే అన్నదాతలను ఆదుకోవాలని సీపీఐ నాయకుడు రామకృష్ణ జగన్ కు లేఖ రాశారు. వర్షాలు, వరదల కారణంగా ఒక్కో ఎకరానికి సుమారు 50 వేల నుంచి లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. తుపానులు, వరదల బీభత్సం వల్ల జరిగిన నష్టాన్ని జాతీయ విపత్తుగా గుర్తించి, తగిన నిధులు విడుదల చేసేలా కేంద్రంపై వైసీపీ సర్కార్ ఒత్తిడి పెంచాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.అసని తుపాను కారణంగా ఏపీలోని పంటలకు 2 వేల 500 కోట్ల మేర నష్టం జరిగిందని గ్లోబల్ కన్సల్టెన్సీ ఆర్ఎంఎస్ఐ అంచనా వేసింది.

ఏపీలో అసని తుపాను కారణంగా అత్యధికంగా 30వేల హెక్టార్లలో వరిపంట నాశనమైందని ప్రాథమిక అంచనా. మొక్కజొన్న 6 వేల 95 హెక్టార్లలో, మినుము పంట, 3 వేల 882 హెక్టార్లలో, వేరుశనగ, 875 హెక్టార్లలో నువ్వుల పంట, 589 హెక్టార్లలో పొద్దుతిరుగుడు, 200 హెక్టార్లలో, బఠాని పంటలు నాశనమయ్యాయి. వాటితో పాటు సజ్జలు, పత్తి, చెరకు, రాగి, మిర్చి, టమోటా, మునగ, జామ, దానిమ్మ, తమలపాకు, కాయగూరలు, ఆకుకూరల పంటలకు కూడా పెద్ద ఎత్తున నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే.. పంట నష్టాన్ని పూర్తిస్థాయిలో ఎప్పుడు అంచనా వేస్తారు, నష్టపరిహారం ఎప్పుడు అందచేస్తారన్న విషయం అంతు చిక్కకుండా ఉందని బాధితులు వాపోతున్నారు.అసని తుపాను ప్రభావంతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో వరి, మామిడి, అరటి రైతులు బాగా నష్టపోయారు. వందలాది ఎకరాల్లోని మామిడి నేల రాలిపోయింది. నేల రాలిన మామిడి పంటను చూసిన రైతుల కళ్లలో నీళ్లు సుడులు తిరుగుతున్నాయి. గెలలు వేసిన అరటి తోటలు నేలమట్టం అవటంతో రైతుల పరిస్థితి దీయనీయంగా మారింది. రాయలసీమలోని కడప, చిత్తూరు జిల్లాల్లో కూడా వర్షాలకు భారీగా పంట నష్టం వాటిల్లింది. శ్రీకాకుళం జిల్లాలో మామిడి, జీడిమామిడి తోటల రైతులు బాగా నష్టపోయారు. మొక్కజొన్న, వేరుశనగ, అరటి, బొప్పాయి పంటలు ధ్వంసం అవడంతో రైతులు దీనస్థితిలోకి వెళ్లిపోయారు. కోనసీమ జిల్లాలో వేలాది రూపాయల పెట్టుబడి పెట్టి సాగు చేసిన వరి పంటతో పాటు రాసులుగా పోయిన ధాన్యం తడిసి ముద్దై పోయింది.అంబాజీపేట, పి.గన్నవరం, అయినవిల్లి, రాజోలు, అమలాపురం, మాచవరంలలో వరి పంటలు నేలకొరిగాయి. కాకినాడ జిల్లా రైతులకైతే అసని గుండెకోత మిగిల్చింది. అసని కారణంగా కృష్ణా జిల్లాలోని అరటి, మొక్కజొన్న తోటలు ధ్వంసం అయ్యాయి. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాల్లో బొప్పాయి, మామిడి, అరటి పంటలు ధ్వంసం అయ్యాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో సుమారు 12 కోట్ల మేర పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు.అసని తుపానుతో పంటలకు ఇంత భారీ ఎత్తున నష్టం వాటిల్లినా ఏపీ సర్కార్ ఏమి చేస్తోందని, పంట నష్టాన్ని అంచనా వేసేందుకు ముందుకు రావడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# జగన్ ఇంట అసమ్మతి సెగలు

విజయవాడ, మే 16 ఫ్యామిలీలో అసమ్మతి సెగలు ఉక్కిరి బిక్కిరి చేసేస్తున్నాయి. తాజాగా వైఎస్ ఫ్యామిలీకి కంచుకోట అయిన పులివెందులలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాలు కుటుంబంలో జగన్ దాదాపు ఒంటరి అయిపోయారని అంటున్నారు. ఇటీవల సీఎం జగన్ సమీప బంధువు.. పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండల వైసీపీ అధ్యక్షుడు వైఎస్ కొండరెడ్డిని పోలీసు అరెస్ట్ చేశారు. ఇది వైఎస్ కుటుంబంలో ప్రకంపనలు సృష్టిస్తోందని సమాచారం. రహదారి పనులు చేయాలంటే అయిదు కోట్ల రూపాయిలు ఇవ్వాలంటూ.. కాంట్రాక్టర్‌ను బెదిరించిన కేసులో అరెస్ట్ అయిన వైఎస్ కొండా రెడ్డి తాజాగా బెయిల్‌పై విడుదలైయ్యారు. అయితే ఆయన్ని జిల్లా నుంచి బహిష్కరిస్తున్నట్లు జిల్లా ఎస్పీ విస్పష్ట ఆదేశాలు జారీ చేశారు. దీంతో వైఎస్ ఫ్యామిలీలోని ఓ వర్గం.. ఆగ్రహంతో రగిలిపోతోందట. పార్టీ అధికారంలో ఉండి కూడా కుటుంబ సభ్యులను అరెస్టు ఆపలేని దుస్థితి దాపురించిందని గరం గరం అయిపోతోందట. ఫ్యామిలీ ఆగ్రహం తాడేపల్లి ప్యాలెస్‌ను సైతం తాకడంతో, జగన్ ఏం చేయాలో తెలియని పరిస్థితిలో పడ్డారట. ఆ క్రమంలోనే బెయిల్‌పై రాయచోటి జైలు నుంచి వైయస్ కొండారెడ్డి విడుదలైనట్లు తెలుస్తోంది. ఆ తర్వాత గంటకే ఆయనపై బహిష్కరణ వేటు పడింది. సాక్షాత్తూ ముఖ్యమంత్రి సమీప బంధువు వైఎస్ కొండారెడ్డిపై జిల్లా ఎస్పీ ఇంత తీవ్ర చర్య ఎందుకు తీసుకున్నారనే ఓ చర్చ ఉమ్మడి కడప జిల్లాలో హాట్ హాట్‌గా నడుస్తోంది. అయితే వైఎస్ కొండా రెడ్డి అరెస్ట్ కావడంతో.. ఆయన ఫ్యామిలీ జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆ క్రమంలోనే కొండారెడ్డిని జైలు నుంచి బెయిల్‌పై విడుదల చేయించి.. జిల్లా నుంచి బహిష్కించేలా సర్కారులోని పెద్దలు స్కెచ్ వేశారని తెలుస్తోంది. ఎందుకంటే.. ఈ కొండారెడ్డి జైలులో ఉంటే.. ఆయన ఫ్యామిలి నుంచి విమర్శలు మరింత పెరిగే అవకాశం ఉందని.. ఆ క్రమంలో కొండారెడ్డిని జైలు నుంచి బెయిల్‌పై విడుదల చేస్తే.. ఆయనపై ఫిర్యాదు చేసిన పెద్దలు మళ్లీ తనకు తలంటే.. అక్షింతలు వేసే అవకాశాలు మెండుగా ఉన్నాయని.. ఆ క్రమంలోనే కర్ర విరగా కూడదు, పాము చావా కూడదు అన్న టైప్‌లో తాడేపల్లి ప్యాలెస్ పెద్దలు చక్రం తిప్పారని తెలుస్తోంది.మరోవైపు ఇప్పటికే జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఆయనకు తల్లి విజయమ్మ, సోదరి షర్మిలతో గ్యాప్ పెరిగింది. ఈ నేపథ్యంలో వారిద్దరు.. తాడేపల్లి ప్యాలెస్ వీడి.. హైదరాబాద్‌లోని లోటస్ పాండ్ చేరుకున్నారు. అంతేకాదు షర్మిల.. వైయస్ఆర్ తెలంగాణ పార్టీని స్థాపించి.. తెలంగాణలో చురుకుగా పని చేస్తున్నారు. దీంతో జగన్‌కు వైయస్ విజయమ్మ, షర్మిలలు దూరమైయ్యారనే టాక్ అయితే గతం నుంచే అటు మీడియాలో ఇటు సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది.. అవుతోంది కూడా. ఇంకోవైపు సోదరుడు జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నా...తన తండ్రి హత్య కేసు ఏ విధంగా సాగుతుంతో వివేకా కుమార్తె డాక్టర్ సునీతతోపాటు ఆమె కుటుంబ సభ్యులకు బాగా అర్థమైంది. దీంతో వారు తన తండ్రి హత్య కేసు సీబీఐకి అప్పగించేలా ఆదేశాలివ్వాలంటూ హైకోర్టు మెట్లెక్కి సాధించుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ హత్య కేసు సీబీఐ చేపట్టడం.. ఆ తర్వాత విచారణలో వివేకా మాజీ డ్రైవర్ దస్తగిరి అప్రూవర్‌గా మారి ఈ హత్య వెనుక ఉన్న సూత్రధారులు, పాత్రధారులతోపాటు ఈ హత్యకు ఫిక్స్ చేసిన సుపారీ ఎంతో సైతం వెల్లడించారు. దీంతో వివేకా హత్య జరిగిన తీరు.. అందుకు దారి తీసిన పరిస్థితులు .. ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలు చూసి ప్రపంచంలోని తెలుగువారంతా నివ్వెరపోయారు. అలాంటి పరిస్థితుల్లో వైయస్ జగన్ ఫ్యామిలీకి సునీత కుటుంబం కూడా బాగా దూరంగా జరిగింది. ఇక ఈ ఏడాది వివేకా వర్ధంతి సందర్భంగా ఆయన సమాధిని ఆమె కుటుంబం మాత్రమే సందర్శించి నివాళులర్పించింది. మిగతా ఫ్యామిలీ ఎక్కడ అనే చర్చ కూడా సోషల్ మీడియా సాక్షిగా నడించింది. అదీకాక.. జగన్ అధికారంలోకి వచ్చిన ఈ మూడేళ్లలో వైయస్ ఫ్యామిలీలోని చాలా మంది సభ్యులు.. ఫ్యాన్ పార్టీ అధినేత ఫ్యామిలీకి దూరం అయ్యారు. ఇలా ప్రజల నుంచీ, పార్టీలోనూ, కుటుంబంలోనూ రోజు రోజుకూ పెరుగుతున్న అసమ్మతితో ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో జగన్ ఉన్నారని ఆయన సన్నిహితులే ఆఫ్ ది రికార్డ్ అంటూ మిత్రులతో చెబుతున్నారు

## ఎండలతో... విద్యుత్ డిమాండ్

విజయవాడ, మే 16, రాష్ట్రంలో విద్యుత్ వినియోగం మళ్లీ క్రమంగా పెరుగుతోంది. అసని తుపాను ప్రభావంతో తగ్గిన డిమాండ్.. మళ్లీ పెరుగుతోంది. విద్యుత్ డిమాండ్ గత నెలతో పోల్చితే ప్రస్తుతం భారీగా తగ్గింది. దేశవ్యాప్తంగా ఏర్పడ్డ బొగ్గు సంక్షోభం కారణంగా ఏర్పడ్డ విద్యుత్ కొరతకు ఏప్రిల్ నెల ప్రారంభంలో రాష్ట్రంలో అత్యధిక డిమాండ్ తోడైంది. ఫలితంగా కొద్ది రోజులు వినియోగదారులు విద్యుత్ కోతలను ఎదుర్కోవాల్సి వచ్చింది. వెంటనే ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సమస్యను పరిష్కరించింది. పరిశ్రమల విద్యుత్ వినియోగంపై ఆంక్షలు విధించింది. గృహాలు, వ్యవసాయానికి ఆటంకం లేకుండా సరఫరా చేసింది. ఇందుకోసం మొదట్లో బహిరంగ మార్కెట్‌లో రోజుకు సుమారు రూ.70 కోట్లు, ఆ తరువాత రోజుకి రూ.40 కోట్లు వెచ్చించి విద్యుత్ కొనుగోలు చేసింది. మార్చి నుంచి ఇప్పటివరకూ బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ కొనుగోళ్లకే రూ.2,687.81 కోట్లు వెచ్చించింది. ఫలితంగా నేటికీ ఉత్తరప్రదేశ్‌లో రోజుకు 1.34 ఎంయూ, బీహార్‌లో 1.44 ఎంయూ, జార్ఖండ్‌లో 2.03 ఎంయూ, రాజస్థాన్‌లో 0.65 ఎంయూ కొరత ఉన్నప్పటికీ మన రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదు.ఏప్రిల్‌లో అత్యధికంగా రోజుకు 235 మిలియన్ యూనిట్ల వరకూ చేరిన వినియోగం కొద్ది రోజుల క్రితం అసని తుఫాను ప్రభావం వల్ల తగ్గుముఖం పట్టిందివాతావరణం చల్లబడటంతో ఈ నెల 11వ తేదీన 151.43 మిలియన్ యూనిట్లకు తగ్గింది. దీంతో వ్యవసాయ, గృహ విద్యుత్ వినియోగదారులకు పూర్తి స్థాయిలో విద్యుత్ అందిస్తూనే, పరిశ్రమలపై ఉన్న ఆంక్షలను దాదాపు ఎత్తేశారు. కానీ అంతలోనే పెరగడం మొదలైంది. ప్రస్తుతం రాష్ట్రంలో 172.86 మిలియన్ యూనిట్ల వినియోగం జరుగుతోంది.రాష్ట్రంలోని వివిధ కేంద్రాల నుంచి జరుగుతున్న విద్యుత్ ఉత్పత్తి డిమాండ్ కంటే ఎక్కువగానే ఉంది. ప్రస్తుతం (ఈ నెల 13న) ఏపీ జెన్‌కో థర్మల్ కేంద్రాల నుంచి 78.45 ఎంయూ, ప్రైవేటు థర్మల్ కేంద్రాల నుంచి 10.75 ఎంయూ, సెంట్రల్ గ్యాస్ స్టేషన్లు నుంచి 39.62 ఎంయూ, హైడ్రో స్టేషన్ల నుంచి 5.48 ఎంయూ, ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్స్ (ఐపీపీ) నుంచి 8.74 ఎంయూ, పవన విద్యుత్ 27.85 ఎంయూ, సౌర విద్యుత్ 17.65 ఎంయూ సమకూరుతోంది. 20.09 ఎంయూ బయటి నుంచి కొన్నారు. మొత్తం 208.63 ఎంయూ అందుబాటులో ఉంది. ప్రస్తుత వినియోగం 172.86 ఎంయూ మాత్రమే ఉంది. దీంతో ఒప్పందాల మేరకు సుమారు 35 ఎంయూను ఇతరులకు విక్రయించారు. మళ్లీ విద్యుత్ డిమాండ్ పెరుగుతుండటంతో మరికొద్ది రోజులు జాగ్రత్త అవసరమని ఇంధన శాఖ అధికారులు చెబుతున్నారు.

## ఫెన్షన్ కోసం భర్త డెత్ సర్టిఫికెట్

కడప, మే 16,పెన్షన్ కోసం.. కట్టుకున్న భర్త బతికుండగానే ' చంపేసింది' ఓ మహిళా వాలంటీర్. అంటే హత్య చేయలేదు. భర్త బతికుండగానే చనిపోయినట్లుగా డెత్ సర్టిఫికెట్ సృష్టించి పెన్షన్ పొందుతోంది. ఈ సంఘటన పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండలంలో జరిగింది. ఈ దారుణానికి పాల్పడింది ఓ మహిళా వాలంటీర్ కావడం విశేషం. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఉదంతానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. చక్రాయపేట మండలానికి చెందిన బళ్లారి సుభాహాన్ బాషా అనే వ్యక్తికి కొన్నేళ్ల క్రితం పెళ్లైంది. వీరికి ఏడాదిన్నర కుమారుడున్నాడు. ఐతే భార్యభర్తల మధ్య గొడవలు రావడంతో విడిగా ఉంటున్నారు.ఈ క్రమంలో భార్య వాలంటీర్‌గా పనిచేస్తోంది. ప్రతినెల ఒకటవ తేదీన పెన్షన్లు పంచడం, సంక్షేమ పథకాల లబ్ధిదారులను నమోదు చేస్తుండటంతో పథకాలు ఎలా పొందాలి, ఎలా సర్టిఫికెట్లు మార్చాలి, అర్హతలను ఎలా చూపించాలనేదానిపై పట్టు సాధించింది. దీంతో భర్తకు దూరంగా ఉంటున్న తనకు వితంతు పెన్షన్ రాయించుకోవాలన్న ఆలోచనతో రావడంతో.. వెంటనే రంగంలోకి దిగి బ్రతికున్న భర్త చనిపోయాడంటూ వీఆర్వో సాయంతో సర్టిఫికెట్ సృష్టించింది. వెంటనే సచివాలయంలో నమోదు చేయించుకొని వితంతు పింఛన్ కార్డు పొందింది చక్కగా పెన్షన్ తీసుకుటోంది.అయితే ఇటీవల.. విషయం తెలియక ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద ఆర్థిక సాయం పొందడానికి భర్త సుభాహాన్ చక్రాయపేటలోని గ్రామ సచివాలయం సిబ్బందిని కలిసి దరఖాస్తు చేశాడు. ఐతే రేషన్ కార్డులో పేరు తొలగించిన కారణంగా పథకం వర్తించే అవకాశం లేదని సిబ్బంది తెలిపారు. దీంతో ఖంగుతిన్న సుభాహాన్.. తన పేరును ఎలా తొలగిస్తారని ఆరా తీశాడు. అతడు మరణించినట్లు నమోదైందని సిబ్బంది వివరించడంతో షాక్ తిన్నాడు. వెంటనే రాయచోటికి వెళ్లి తహసీల్దార్ను కలిశాడు.కొత్తపల్లి గ్రామ సచివాలయానికి చెందిన వీఆర్వో యోగాంజనేయ రెడ్డి లాగిన్ ద్వారా ఆన్లైన్లో మరణించినట్లు నమోదైనట్లు అధికారులు గుర్తించి.. అధికారులు ఆరా తీయగా భార్యే వీఆర్వోతో కలిసి ఈ పని చేసినట్లు తేలింది. దీంతో అక్రమంగా తాను చనిపోయినట్లు రికార్డులు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశాడు.

## రాజ్యసభ లెక్కలు... ఫ్యాన్ ఖాతా...

విజయవాడ, మే 16,దేశవ్యాప్తంగా ఖాళీ అవబోతున్న 57 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం గురువారం షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఆయా స్థానాలకు ఈ నెల 24న నోటిఫికేషన్ జారీ కానుంది. నామినేషన్ల స్వీకరణకు తుది గడువు ఈ నెల 31వ తేదీ గా నిర్ణయించారు. జూన్ 1న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. జూన్ 3వ తేదీ వరకు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు. ఇక జూన్ 10వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. పోలింగ్ ముగిసిన తర్వాత అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉండనుంది. జూన్ నుంచి ఆగస్టు నెల వరకు 15 రాష్ట్రాల్లో మొత్తం 57 రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. వీటన్నింటికీ కలిపి ఎన్నికల సంఘం ఒకేసారి షెడ్యూల్‌ను విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల్లో 6 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఆంధ్ర ప్రదేశ్‌లో 4, తెలంగాణలో 2 స్థానాలు ఖాళీ అవుతున్నాయి. తెలంగాణ నుంచి టీఆర్ఎస్ ఎంపీలు కెప్టెన్ లక్ష్మీకాంతరావు, ధర్మపురి శ్రీనివాన్ పదవీకాలం ముగియనుంది. జూన్ 21న ఏపీ నుంచి బీజేపీ ఎంపీలు సురేశ్ ప్రభు, టీజీ వెంకటేశ్, సుజనా చౌదరి, వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి రిటైర్ అవుతున్నారు. అసెంబ్లీలో సంఖ్యాబలం రీత్యా తెలంగాణలోని 2 స్థానాలను టీఆర్ఎస్, ఏపీలో 4 స్థానాలను వైసీపీ కైవసం చేసుకోనున్నాయి. రాష్ట్ర శాసన సభలో మొత్తం 175 స్థానాలకు గాను 150 వైఎస్సార్‌సీపీ సొంతం చేసుకుంది. 23 స్థానాల్లో టీడీపీ, ఒక స్థానంలో జనసేన ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఒక్కో స్థానంలో గెలవడానికి సగటున 44 మంది ఎమ్మెల్యేల ఓట్లు అవసరం. దీంతో నాలుగు స్థానాలూ వైఎస్సార్‌సీపీ గెల్చుకునే అవకాశాలే ఎక్కువ..! రాజ్యసభలో రాష్ట్ర కోటా 11 స్థానాలు. ప్రస్తుతం ఐదుగురు వైఎస్సార్‌సీపీ సభ్యులున్నారు (జూన్ 21తో పదవీ కాలం ముగిసే విజయసాయిరెడ్డి స్థానాన్ని మినహాయిస్తే). జూన్ 10న పోలింగ్ జరిగే నాలుగు రాజ్యసభ స్థానాలు వైఎస్సార్‌సీపీ ఖాతాలోకి చేరతాయి. అప్పుడు వైఎస్సార్‌సీపీ బలం ఐదు నుంచి తొమ్మిదికి పెరుగుతుంది.

గుంటూరు, మే 16, ప్రభుత్వ రంగ సంస్థలు ఆర్థికంగా మునిగిపోయే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ అవసరాల కోసం చేస్తున్న అప్పులు సంపదసృష్టికి అక్కరకు రావడం లేదని ఆయా సంస్థల అధికారులే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై దృష్టి సారించిన అకౌంటెంటు జనరల్ కార్యాలయం కూడా నాలుగు రోజుల క్రితం రాష్ట్ర ఆర్థికశాఖకు ఒక లేఖ రాసింది. బడ్జెట్ ప్రతిపాదనల్లో లేకుండా తీసుకుంటున్న ఇటువంటి రుణాల వివరాలు సమర్పించాలని నిర్దేశించింది. ప్రభుత్వ రంగ సంస్థలైన అనేక కార్పొరేషన్లు ఇటీవల కాలంలో భారీగా రుణాలు తీసుకుంటు న్నాయి. దాదాపు 33 సంస్థలు రెండు లక్షల కోట్లకుపైగా రుణాలు తీసుకున్నట్లు సమాచారం. ఇందులో సింహభాగం ప్రభుత్వ అవసరాలకు పిడి ఖాతాల ద్వారా మళ్లిపోతున్నట్లు కనిపిస్తోంది. మొత్తం ఆఫ్ బడ్జెట్ బారోయింగ్స్ కింద 33 సంస్థలు రూ.2.14 లక్షల కోట్ల వరకు రుణాలు సేకరించినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో అత్యధికంగా రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ రూ.35 వేల కోట్ల వరకు రుణాలు తీసుకున్నట్లు తేలింది. ఇంధన శాఖకు సంబంధించి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ రూ.14 వేల కోట్లు, పవర్ కో-ఆర్డినేషన్ సంస్థ ద్వారా డిస్కామ్‌లు రూ.11 వేల కోట్లు, జెన్‌కో రూ.5 వేల కోట్లు, పవర్ డెవలప్‌మెరటు కార్పొరేషన్ రూ.వెయ్యి కోట్లు రుణంగా తీసుకున్నట్లు సమాచారం. ఇక ఇళ్ల నిర్మాణానికి సంబంధించి టిడ్కో రూ.12 వేల కోట్లు, గృహ నిర్మాణ సంస్థ రూ.4 వేల కోట్లు రుణంగా సమీకరించుకున్నట్లు తెలిసింది. రహదారుల అభివృద్ధి సంస్థ, నీటివనరుల అభివృద్ధి సంస్థ, ఆర్‌టిసి కూడా ఆఫ్ బడ్జెట్ బారోయింగ్స్ తీసుకున్న జాబితాలో ఉన్నాయి. కొత్తగా ఏర్పాటుచేసిన రాష్ట్రాభివృద్ధి సంస్థ రూ.23 వేల కోట్లు, ఫైనాన్షియల్ సర్వీసెస్ కార్పొరేషన్ రూ.10 వేల కోట్లు తీసుకోగా, గ్యారెంటీలు లేకుండా మరికొన్ని

# అప్పుల్లో కార్పొరేషన్లు...

సంస్థలు రూ.65 వేల కోట్ల వరకు రుణాలు తీసుకున్నట్లు సమాచారం. మొత్తం రుణంలో కొన్ని సంస్థలు తామే రుణం తీసుకుని, తామే చెల్లించుకుంటున్నది రూ.50 వేల కోట్ల వరకు ఉంటుందని, దీంతో ఆఫ్ బడ్జెట్ బారోయింగ్స్ మొత్తం 1.64 లక్షల కోట్లకు చేరుకున్నట్లుగా ఉందని తెలిసింది. ఇంత భారీ రుణాలపై ఏటా రూ.15 వేల కోట్ల నుంచి రూ.17 వేల కోట్ల వరకు అసలుకు వాయిదాలు, వడ్డీలు చెల్లించాల్సి వస్తోందని తెలుస్తోంది. ఇది రానున్న రోజుల్లో పెను భారంగానే మారుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.ఎజి కార్యాలయం రాసిన లేఖ ఆర్థికశాఖలో ప్రకంపనలు సృష్టిస్తోంది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేసే అభివృద్ధి వ్యయం అంతా నిర్దిష్ట రుణ పరిమితికి లోబడే ఉండాలని పేర్కొంది. అనుమతి లేకుండా చేసే రుణాలు ప్రభుత్వ రుణాలుగానే పరిగణించాల్సి ఉంటుందని స్పష్టం చేసినట్లు తెలిసింది. అందుకే అనేక కోణాల్లో వివరాలు కూడా కోరింది. ఏ ప్రభుత్వ రంగ సంస్థ ఎంత రుణం తీసుకుంది, అందులో ప్రభుత్వ గ్యారెంటీతో తీసుకున్న రుణం ఎంత అన్న వివరాలతోపాటు, రుణమిచ్చిన ఆర్థిక సంస్థ, అందుకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల వివరాలు కూడా సమర్పించాలని కోరింది.3 వేల కోట్లలో 782 కోట్లే వచ్చిందిరాష్ట్ర ఖజానా మళ్లీ ఓవర్‌డ్రాఫ్ట్‌లోకి చేరిపోయింది. జీతాలకు కూడా డబ్బుల్లేక ఈ నెల ఐదో తేదీన రూ.2,118 కోట్లు ఓవర్‌డ్రాఫ్ట్‌లోకి ఆర్థికశాఖ వెళ్లింది. ఈ నగదుతోనే వాయిదాల పద్ధతిపై కొంతమందికి జీతాలు చెల్లించగలిగారు. ఇదే సమయంలో ఆరో తేదీన సెక్యూరిటీ బాండ్ల తనఖా ద్వారా రిజర్వు బ్యాంకు నుంచి బహిరంగ మార్కెట్ రుణాలుగా రూ.మూడు వేల కోట్లు తీసుకున్నారు. వెరటనే ఈ రుణంలో ఓవర్‌డ్రాఫ్ట్‌కు సంబంధించిన రూ.2,118 కోట్లు రిజర్వు బ్యాంకులో జమైనట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో కేవలం రూ.872 కోట్లు మాత్రమే ఇతర అవసరాలకు మిగిలినట్లు సమాచారం. ఏప్రిల్ నెలను ఎటువంటి ఓవర్‌డ్రాఫ్ట్ లేకుండానే నెట్టుకు వచ్చిన ఆర్థికశాఖ మే నెల్లో మాత్రం ఓడికి వెళ్లకతప్పలేదు. ఐదో తేదీన ఉపయోగించుకున్న ఓవర్‌డ్రాఫ్ట్ వరుసగా మూడు రోజులు కొనసాగడం గమనార్హం. ఏప్రిల్ ఆఖరులో మిగుల్చుకున్న నిధులతో మే ఒకటో తేదీన సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. దీంతో ఖజానా ఖాళీ కావడంతో ఉద్యోగులకు జీతాలు, పింఛన్లను అందించలేకపోయారు. మూడో తేదీ రంజాన్ కావడంతో నాలుగు, ఐదో తేదీల నుంచి జీతాల చెల్లింపులు ప్రారంభించారు. అందుకే ఐదో తేదీన తప్పనిసరిగా ఓడీకి వెళ్లి జీతాలు చెల్లించేందుకు చర్యలు ప్రారంభించారు. ఈ నిధులు కూడా చాలకపోవడంతో చాలామందికి ఇంకా జీతాలు పడలేదని తెలిసింది. బహిరంగ మార్కెట్ రుణాల ద్వారా వచ్చిన నిధులను జీతాలు, పింఛన్లకు వినియోగించుకోవాలంటే అందులో కూడా సింహభాగం నిధులు ఓడి రూపంలో రిజర్వు బ్యాంకులో జమైపోయాయి. ఈ కారణంగానే పూర్తిస్థాయిలో జీతాలు చెల్లించలేకపోయినట్లు ఒక అధికారి వ్యాఖ్యానించారు.

# మార్కెట్లలోనే తక్కువకు వేరుసెనగ



అనంతపురం, మే 16, ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చాక కూడా అంతకంటే తక్కువ ధరకే వేరుశనగ విత్తనాలు బహిరంగ మార్కెట్‌లో దొరుకుతున్నాయి. రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికె)లో అందించే విత్తనం క్వింటాలుకు సబ్సిడీ పోను రైతు రూ.5,117 చెల్లించాలి. కానీ బహిరంగ మార్కెట్‌లో అంతకంటే కాస్త తక్కువ రేటుకే ఎలాంటి రాయితీ లేకుండానే లభ్యమవుతున్నాయి. మరీ అయితే నాణ్యత, వెరైటీ (రకం) బట్టి రూ. రెండు మూడొందలు మాత్రమే ధరలో వ్యత్యాసం ఉంది. ప్రభుత్వం క్వింటాలుకు ఇస్తున్న రూ.వేల సబ్సిడీ ఎవరి జేబుల్లోకి పోతోందన్నదే ప్రశ్న. గత కొన్నేళ్లుగా జరుగుతున్న తంతే ఈ ఏడాదీ అమలవుతోంది. ఈ తడవ నేరుగా రైతుల నుండి కాకుండా టెండర్లపై ట్రేడర్ల నుండి విత్తనాలను సేకరిస్తుండటంతో వ్యవహారం ఇంకా ముదిరినట్లు ఆరోపణలొస్తున్నాయి.రానున్న ఖరీఫ్‌లో రాయలసీమ జిల్లాల్లో మూడున్నర నుండి నాలుగు లక్షల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను రాయితీపై పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. విత్తనాల అమ్మకం ధర క్వింటాలు రూ.8,480గా నిర్ణయించగా, అందులో 3,367 సబ్సిడీ. అది పోను రైతు నికరంగా 5,117 చెల్లించాలి. సేల్ ప్రైస్‌లో 40 శాతం సబ్సిడీ ఇస్తున్నారు. అయితే ప్రభుత్వ రాయితీతో సంబంధం లేకుండా రైతులు నేరుగా బహిరంగ మార్కెట్‌లో విత్తనాన్ని కొనుగోలు చేస్తే రూ.5,100కే లభ్యమవుతున్నాయి. క్వాలిటీ, డిమాండ్ ఉన్న వెరైటీలకు బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం ఉన్న రేటు రూ.5,500 అంటే బాగా ఎక్కువ. ప్రభుత్వం క్వింటాలుకు రూ.3 వేలకు పైన సబ్సిడీ ఇచ్చామంటుండగా, అదేమీ లేకుండానే, ప్రభుత్వం రైతును చెల్లించమన్న నాన్-సబ్సిడీ అమౌంట్ కంటే తక్కువకే, లేదంటే రూ.రెండు మూడొందల వ్యత్యాసంతోనే మార్కెట్‌లో సులభంగా దొరుకుతుండటంతో మరొకసారి రాయితీ విత్తనాల ధరల నిర్ణయం, కమీషన్లు, అవినీతి అక్రమాలు చర్చనీయాంశమయ్యాయి. మార్కెట్‌లో పంట రాగానే క్వింటాలు రూ.6-7-8 వేలకు నాణ్యమైన విత్తన కాయలను రైతులు అమ్ముకున్నారు. మిగిలినవి కాస్త తక్కువ నాణ్యమైనవి. సబ్సిడీ విత్తనాల సరఫరా కోసం ట్రేడర్లు అంతగా నాణ్యత లేని కాయలను సేకరించి, తూతూ మంత్రంగా ప్రాసెస్ చేసి, ఎపి సీడ్స్‌కు ఇస్తున్నారు. ప్రాసెసింగ్, ప్యాకింగ్, రవాణ అంటూ ఎపి సీడ్స్ క్వింటాలుకు వేల రూపాయల వంతున ఖర్చులను కలుపుకొని సేల్ ప్రైస్‌ను నిర్ణయిస్తోంది. ఆ ధరలో 40 శాతం సబ్సిడీ అంటోంది. ఈ విధానం వలన విత్తన రైతులకు దక్కాల్సిన గిట్టుబాటు ధర రాక నష్టపోతున్నాడు. మరో వైపు పంట సాగు చేసే రైతు అధిక ధర చెల్లిస్తున్నాడు. మధ్యలో ట్రేడర్లు, ప్రభుత్వంలోని కొందరు కమీషన్లు లాగిస్తున్నారు.ఇదిలా ఉండగా మే మూడవ వారంలో ఆర్‌బికెలలో ముందస్తు బుకింగ్‌ల ద్వారా వేరుశనగ విత్తనాల పంపిణీని ప్రారంభించాలనుకోగా ఇప్పటికి పంపిణీకి సిద్ధమైన స్టాక్ 60 వేల క్వింటాళ్లలోపేనని సమాచారం. టెండర్లు పొందిన ట్రేడర్లు విత్తనాల సేకరణ, ప్రాసెసింగ్‌ను నెమ్మదిగా కొనసాగిస్తున్నారని తెలిసింది. ఈ ప్రభావం పంపిణీకి నిర్ణయించిన షెడ్యూల్‌పై పడుతుందని చెబుతున్నారు.

# రైతు చల్లగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షం




కడప రైతు చల్లగా ఉంటేనే రాజ్యం సుభిక్షంగా ఉంటుందని నమ్మిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రైతు పక్షపాతి అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా అన్నారు. సోమవారం ఏలూరు జిల్లా గణపవరం మండలం లో బహిరంగ సభ నుండి "వైఎస్ఆర్ రైతు భరోసా-పిఎం కిసాన్ యోజన" 4వ ఏడాది మొదటి విడత ఆర్థిక సాయం మొత్తాన్ని కంప్యూటర్ బటన్ నొక్కి.. రైతుల ఖాతాలకు నేరుగా బదిలీ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు.ఈ కార్యక్ర మానికి జిల్లా నుండి.. కమలాపురం నియోజకవర్గ కేంద్రంలోని.. ఎంపిడివో కార్యాలయ ప్రాంగణం నుండి.. జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు తో పాటు.. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డిలు ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా జిల్లా కలెక్టర్ విజయ్ రామరాజు, ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి లతో కలిసి.. జిల్లాలో "రైతు భరోసా- పిఎం కిసాన్ యోజన" పథకం క్రింద వరుసగా 4వ ఏడాది మొదటి విడతగా.. 1,98,074 మంది రైతులకు మంజూరయిన రూ.108,95,01,000 లు మొత్తాన్ని మెగా చెక్కు రూపంలో రైతులకు అందజేశారు. అనంతరం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా మాట్లాడుతూ.. రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని భావించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 4వ ఏడాది మొదటి విడత "వైఎస్సార్ రైతు భరోసా" సాయాన్ని అందించడం ద్వారా.. వ్యవసా యంపై రైతుల్లో మరింత మక్కువ పెరిగిందన్నారు. గ్రామ సీమలో రైతులు సాగుబడిని పండుగ వాతావరణంలో చేపడుతు న్నారన్నారు. వాస్తవ సాగుదా ర్లందరికీ సాయం అందాలన్నది సర్కారు లక్ష్యం కాగా.. ఈ ఖరీఫ్ సీజన్ కు లబ్ధిదారుల సంఖ్య కూడా పెరిగిందన్నారు. ఈ ఏడాది.. ప్రకృతి కరుణించి అనుకున్న సమయానికంటే ముందుగానే రుతుపవనాలు కూడా రానున్నాయని.. ఆ దిశగా ఖరీఫ్ సాగుకు ప్రభుత్వం రైతులను సమాయత్తం చేస్తోందన్నారు. కరోనా మహమ్మారి కారణంగా గత రెండేళ్లు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నాకుడా.. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం.. రైతు భరోసా సాయాన్ని అందించా రన్నారు. ప్రస్తుతం నిరాటంకంగా నాలుగవ ఏడాది కూడా... రైతు భరోసా సాయం అందివ్వడం సంతోషించదగ్గ విషయం అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు మాట్లాడుతూ రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ ఆరంబానికి ముందే రైతులకు సాగుబడి ఖర్చుల కోసం ఆర్థిక సాయం అందివ్వడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఖరీఫ్ సీజన్ కోసం రైతులను సన్నద్ధం చేస్తున్న రాష్ట్ర ముఖ్య మంత్రి అన్ని జిల్లాల కలెక్టర్లను, ఇరిగేషన్ అధికారులతో కూడా సమీక్షిస్తూ ఒక నెల ముందే.. ప్రాజెక్టుల నుండి సాగునీటి వసతిని రైతులకు కల్పించాలని.. అదేశించడం జరిగిందన్నారు. అర్హత ఉండీ "వైఎస్ఆర్ రైతు భరోసా" పథకం లబ్ది ఇంకను పొందని వారుంటే.. సంబందిత వార్డు లేదా గ్రామ వాలంటీర్లను, సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ ను, మండల వ్యవసాయ అధికారిని గానీ సంప్రదించాలన్నారు. ఆర్బికెల్లో.. నిరంతరం రైతులకు సలహాలు సూచనలు అందేలా.. కాల్ సెంటర్లు పనిచేస్తున్నాయన్నారు. ఇంకా.. ఏవైనా సమస్యలు ఉంటే ప్రభుత్వ టోల్ ఫ్రీ నెంబర్ : 155214 కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయం దండగ అన్న గత ప్రభుత్వ తీరును మార్చేసి... వ్యవసాయాన్ని పండుగలా మార్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాది నుంచే "రైతు భరోసా" సాయం పథకాన్ని ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చారంటే.. వైఎస్ జగన్మో హన్ రెడ్డికి రైతులపై ఉన్న అభిమానం, శ్రద్ధ ఎంతటిదో అర్థమవుతోందన్నారు. ప్రతి ఏడాది రూ.13,500ల చొప్పున ఐదేళ్లలో రూ.67,500లను అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి అందిస్తోం దన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు గాను భూ యజమానులతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కౌలు రైతులకు, దేవాదాయ, అటవీ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు కూడా రైతు భరోసా ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందించడం మహా అద్భుతం అన్నారు. ఈ కార్యక్రమంలో చింతకొమ్మదిన్నె జడ్ పి టిసీ సభ్యులు నరేన్ రామాంజల రెడ్డి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పి.శివప్ర సాద్ రెడ్డిలు, కడప నగర డిప్యూటీ.మేయర్ నిత్యానంద రెడ్డి, జిల్లా రైతు సలహా మండలి చైర్మన్.పి.శివప్రసాద్ రెడ్డి, రాష్ట్ర వేర్ హౌస్ కార్పొరేషన్ చైర్మన్ కరీముల్లా, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్తేర్ రాణి, ఎపి మైన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వీరప్రతాప్ రెడ్డి, కమలాపురం మార్కెట్ యార్డు చైర్మన్ ఉత్తమరెడ్డి, కడప ఆర్డీవో ధర్మచంద్రారెడ్డి, కమలాపురం తహసీల్దార్ అమరేశ్వరి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నాగేశ్వర రావు, ఉద్యానశాఖ డిడి వజ్రశ్రీ, ఏపీఎంఐపీ పీడి మధుసూధన రెడ్డి, డి.ఆర్.సి. ఏడీఏ నాగరాజు, మండల అధ్యక్షురాలు భారతి, ఎంపీపీవో శ్రీదేవి, స్థానిక వ్యవసాయశాఖ ఎడి అనుబంధశాఖలఅధికారులు,లబ్ధిదారులయి రైతులుతదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ టెలి కమ్యూనికేషన్, సమాచార సొసైటీ దినోత్సవం

ప్రతి సంవత్సరం మే 17న ఈ దినోత్సవం నిర్వహించబడుతుంది. సాంకేతికత (టెక్నాలజీ) ద్వారా వచ్చే అవకాశాలపై అవగాహన పెంచడంకోసం ఈ దినోత్సవం జరుపుకుంటారు.టెలి కమ్యూనికేషన్ దినోత్సం: మొదటిసారిగా మే 17, 1968లో ప్రపంచ టెలికమ్యూనికేషన్ దినోత్సవం జరుపుకున్నారు. మే 17న అంతర్జాతీయ టెలిగ్రాఫ్ యూనియన్ స్థాపించారు. అలాగే మొదటి అంతర్జాతీయ టెలిగ్రాఫ్ కన్వెన్షన్ పై 1865 మే 17న పారిస్‌లో సంతకం చేశారు. అందువల్ల మే 17ను ప్రపంచ టెలికమ్యూనికేషన్ దినోత్సవంగా ప్రకటించారు.సమాచార సొసైటీ దినోత్సవం: 2005లో ట్యూనిస్‌లోని ఇన్ఫర్మేషన్ సొసైటీపై ప్రపంచ శిఖరాగ్ర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రతి సంవత్సరం మే 17న ప్రపంచ సమాచార సొసైటీ దినోత్సవం జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి సర్వసభ్య తీర్మానం ద్వారా ప్రకటించబడింది.2006, నవంబరులో టర్కీలోని అంటాల్యాలో జరిగిన అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్ ప్లీనిపోటెన్షియరీ కాన్ఫరెన్స్‌లో ఈ రెండింటిని కలిపి ప్రతి సంవత్సరం మే 17న ప్రపంచ టెలి కమ్యూనికేషన్, సమాచార సొసైటీ దినోత్సవంగా జరుపుకోవాలని ప్రకటించబడింది.సుదూర ప్రాంతాల మధ్య దూరాన్ని తగ్గించేలా కమ్యూనికేషన్‌ని వ్యాప్తి చేయడమే ఈ దినోత్సవం ముఖ్యోద్దేశం. మన జీవితంలో కమ్యూనికేషన్ ఎంత కీలకమైనదో అవగాహన పెంచడం, ఈ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధిపరచడం వంటివి ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యాలు.

# పల్లెప్రగతిని పరుగులు పెట్టించాలి

## బోయిన్ పల్లి మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్

చొప్పదండి చొప్పదండి నియోజకవర్గం బోయినిపల్లి మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ అధ్యక్షతన ఎంపిడిఓ నల్లాల రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు వారి నివేదికను చదివి వినిపించారు.పలువురు ప్రజాప్రతినిధుల సందేహాలను అధికారులు నివృత్తి చేశారు,రివ్యూ జరుగుతున్న సమయంలో మండల కో-ఆప్షన్ సభ్యుడు మహ్మద్ ఆజ్జూ మాట్లాడుతూ స్త్రీ స్వశక్తి భవనం అసంపూర్తిగా ఉందని మండల కేంద్రం 816 మహిళా గ్రూపులకు గాను,9315 మహిళా సభ్యులు ఉన్నారని,ప్రతి నెల రెండుసార్లు సమావేశ నిమిత్తం మండల కేంద్రానికి వస్తారని,అరకొర సౌకర్యాలతో ఉన్న పాత భవనంలో కాలం వెళ్లదిస్తున్నారని,కావున నూతన భవనం వెంటనే పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ ఇచ్చినా సందర్భంగా పోటీపరీక్షలలో పాల్గొనే నిరుద్యోగ యువతకు పుస్తకాలు అందుబాటులో ఉంచాలని గ్రంధాలయ ఛైర్మెన్ ఆకునూరి శంకరయ్యను కోరారు.అనంతరం ఎంపిపి పర్లపల్లి వేణుగోపాల్ మాట్లాడుతూ తెరాస ప్రభుత్వం పార్టీలకతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలను అందరికీ అందేలా చూస్తామన్నారు. గ్రామాలలో ఉన్న సమస్యలపై దృష్టి సారించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేసి పెండింగ్ పనులు పూర్తి చేస్తామని తెలిపారు.అధికారులు రాబోయే సమావేశాల్లో పూర్తి స్థాయి నివేదికను తీసుక రావాలని, మండలంలోని అన్ని సమస్యలపైనా నివేదికలను ఇవ్వాలన్నారు.అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలసి పని చేయాలని అన్నారు.ఈ నెల20 నుండి పల్లెప్రగతి విజయవంతం చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కత్తెరపాక ఉమాకొండయ్య,తహశీల్దార్ మజీద్,వైస్ ఎంపీపీ నాగయ్య,సెస్ డైరెక్టర్ మేడుదుల మల్లేశం,రైతు బంధు కన్వీనర్ లచ్చిరెడ్డి,మండల కో- ఆప్షన్ సభ్యులు మహ్మద్ ఆజ్జూ,సర్పంచ్ లు, ఎంపీటీసీలు,వ్యవసాయ అధికారిని,ప్రణీత ఎం.ఈ.ఓ. శ్రీనివాస దీక్షితులు,వివిధ శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు





# అష్టదళపాదపద్మారాధన సేవ కొనసాగింపు

## తిరుప్పావడ సేవా టికెట్లు గలవారికి బ్రేక్ దర్శనం

తిరుమల, మే 16 వేసవిలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారి సౌకర్యార్థం జూన్ 30వ తేదీ వరకు అష్టదళపాదపద్మారాధన, తిరుప్పావడ సేవలను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు టిటిడి ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ప్రతి మంగళవారం నిర్వహించే అష్టదళపాదపద్మారాధన సేవాటికెట్లను జూన్ వరకు ఆన్లైన్ లో విడుదల చేయడంతో భక్తులు బుక్ చేసుకున్నారు. కావున ఆన్లైన్ లో సేవాటికెట్లు బుక్ చేసుకున్న వారిని అష్టదళపాదపద్మారాధన సేవకు అనుమతించాలని టిటిడి నిర్ణయించింది.అదేవిధంగా, అడ్వాన్స్ బుకింగ్ లో జూన్ 30వ తేదీ వరకు తిరుప్పావడ సేవా టికెట్లు గలవారు ఆయా తేదీల్లో బ్రేక్ దర్శనానికి రావాలని కోరింది. లేనిపక్షంలో సేవాటికెట్ రీఫండ్ పొందాలని కోరడమైనది.

# శ్రీ కపిలేశ్వరాలయంలో శాస్త్రోక్తంగా పత్ర పుష్పయాగం

తిరుమల, మే 16 తిరుపతి శ్రీ కపిలేశ్వరాలయంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా పత్ర పుష్పయాగం సోమవారం శాస్త్రోక్తంగా జరిగింది. ఇందులో భాగంగా ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి, అభిషేకం నిర్వహించారు. అనంతరం ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు శ్రీ కపిలేశ్వర స్వామివారు, శ్రీ కామక్షి అమ్మవారి ఉత్సవర్లకు నవ కలశ స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పంచామృతాభిషేకం, చెరుకు రసం, కొబ్బరినీళ్ళు, విబూది, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పత్ర పుష్పయాగ మహోత్సవం జరిగింది. ఇందులో చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, జాజి, రోజా, తామర, మల్లి, వృక్షి, కనకాంబరంలతో పాటు బిల్వ పత్రం, తులసి, పన్నీరు ఆకులతో స్వామి, అమ్మవార్లకు పత్ర పుష్ప యాగ మహోత్సవం నిర్వహించారు. స్వామివారి పత్ర పుష్పయాగానికి ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుల నుండి దాతలు 2.5 టన్నులు పుష్పాలు, పత్రాలు విరాళంగా అందించారు. ఇందులో 11 రకాల పుష్పాలు, ఐదు రకాల పత్రాలు ఉన్నాయి. అనంతరం గార్డెన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్శ్రీ శ్రీనివాసులును ఆలయ డెప్యూటీ ఈవో శ్రీ దామోదరం శాలువాతో సన్మానించారు. లోక క్షేమం కొరకు, ఆలయంలో అర్చక పరిచారకుల వల్ల, అధికార అనధికారుల వల్ల, భక్తుల వల్ల ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పత్ర పుష్పయాగం నిర్వహిస్తారని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సిఏవో శ్రీ శేష శైలేంద్ర, ఆలయ ఏఈవో శ్రీ శ్రీనివాపులు, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# స్వర్ణరథంపై మెరిసిన శ్రీ పద్మావతి అమ్మవారు

తిరుమల, మే 16 తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక వసంతోత్సవాల్లో భాగంగా రెండో రోజైన సోమవారం స్వర్ణరథంపై అమ్మవారు భక్తులకు అభయమిచ్చారు. స్వర్ణరథంపై అమ్మవారిని దర్శిస్తే తలచిన పనులు నెరవేరడంతో పాటు, మరో జన్మ ఉండదని అర్చకులు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను ఊరేగింపుగా స్వర్ణరథం మంటపానికి తీసుకొచ్చారు. ఉదయం 7 నుండి 8.30 గంటల వరకు స్వర్ణరథోత్సవం వేడుకగా జరిగింది. బంగారు రథాన్ని అధిరోహించిన అమ్మవారు ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు.మధ్యాహ్నం 2.30 నుండి 4.30 గంటల వరకు అమ్మవారి ఉత్సవర్లకు శుక్రవారపు తోటలో స్నపనతిరుమంజనం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పసుపు, కుంకుమ, పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్ళతో అభిషేకం చేస్తారు. రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు అమ్మవారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించరు.

# అర్జీ దారుల సమస్యలను వెంటనే పరిష్కారించాలి

కడప ప్రజా సమస్యల పరిష్కారార్థం ఏర్పాటు చేసిన "స్పందన" కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీదారుల సమస్యలను అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాల్లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ "స్పందన" కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు డిఆర్వో మాలోల, డ్వామా పి.డి. యదుభూషన్ రెడ్డి, స్పెషల్ కలెక్టర్ రామమోహన్, అనుడ విసి శ్రీలక్ష్మి..లు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు మాట్లాడు తూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రూపొం దించిన స్పందన పోర్టల్ ద్వారా.. ప్రజా సమస్యలను మరింత సులభతరంగా, నాణ్యతతో పరిష్కరించడంతో పాటు.. పరిష్కార నివేదికను కూడా సంబందిత పోర్టల్లో పొందుప రచాలని అధికారులను ఆయన ఆదేశించారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆయా శాఖల అధికారులు తమకు ఇచ్చిన లక్ష్యాల మేరకు ఫలితాలను సాధించా లన్నారు. ఈ కార్యక్ర మంలో కలెక్టరేట్ ఓ.ఎస్. డి. రఘునాథ్, సమగ్ర శిక్ష పీడి ప్రభాకర రెడ్డి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.నాగరాజు, రిమ్స్ సూపర్ ఇన్ టెండెంట్ డా.ప్రసాద్, గృహనిర్మాణ శాఖ పీడి కృష్ణయ్య, డి.సి.ఓ., సుభాషిణి, విద్యుత్ శాఖ ఎస్.ఈ. శోభ వలేంటీన, ఎస్ సి కార్పొరేషన్ ఈడి వెంకట సుబ్బయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారి బ్రహ్మయ్య, జడ్పి సీఈవో సుధాకర్ రెడ్డి, గ్రౌండ్ వాటర్ డి.డి. మురళీధర్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి నాగేశ్వరరావు,సి పి ఓ, ఉద్యానశాఖ డిడి వజ్రశ్రీ, అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ మోటర్లు బిగించే ఆలోచన విరమించుకోవాలి

### ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల డిమాండ్

నంద్యాల నంద్యాల పట్టణంలో సోమవారం నాడు స్థానిక సాయిబాబా నగర్ లోని సిపిఐ కార్యాలయంలో రైతు సంఘం కార్యదర్శి జి. సోమన్న అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథులుగాసిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ సిపిఐ పట్టణ కార్యదర్శి కె. ప్రసాద్ సిపిఐ ఎంఎల్(న్యూ డెమొక్రసీ) కార్యదర్శి శంకర్ టిడిపి రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ చింతలయ్య ఉపాధ్యక్షులు ఆనంద రావు ఏఐటియుసి పట్టణ కార్యదర్శి డి. శ్రీనివాసులు ఎ ఐ యస్ ఫ్ . కర్నూలు జిల్లా ఉమ్మడి అధ్యక్షులు ఎ. సురేష్ . పాల్గొన్నారు . అనంతరం నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం ప్రధాని మోడీ ఏది చెప్తే అది తూచా తప్పకుండా పాటిస్తూ ఉన్నారని ఎద్దేవా చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వము వ్యవసాయం నల్ల చట్టాలను రైతుల మీద ఉపయోగించి తర్వాత రైతులకు క్షమాపణ చెప్పడం జరిగింది. పక్కన ఉన్న తెలంగాణ రాష్ట్రం కేరళ తమిళనాడు రాష్ట్రాల కంటే ముందుగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి పైలెట్ ప్రాజెక్టు పేరుతో శ్రీకాకుళం జిల్లాలో మొదలుపెట్టి రాష్ట్రమంతటా విస్తరింప చేయాలని ఆలోచనను విరమించుకోవాలని కోరారు. అకాల వర్షాల వలన పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘాల ఆధ్వర్యంలో మొరపెట్టినా పట్టించుకోని రాష్ట్ర ముఖ్యమంత్రి రైతుల పంపుసెట్లకు విద్యుత్ మోటార్లు బిగించి రైతుల మెడకు ఉరి బిగించడం మే అన్నారు. ఈ కారణంతో రైతులకు ఇచ్చే సబ్సిడీలు ఉచిత విద్యుత్ కోల్పోవడం జరుగుతుందన్నారు. రైతుల పంపుసెట్లకువిద్యుత్ మోటార్లు బిగించే ఆలోచనను విరమించుకోవాలని లేనిపక్షంలో రైతులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారుఈ కార్యక్రమంలో రైతులు వెంకటేశ్వర్లు సుబ్బయ్య రాముడు తదితరులు పాల్గొనడం జరిగింది.

# కల్లూరు అర్బన్ ప్రాంత వార్డులలో మంచినీటి సమస్య పరిష్కరించాలి



### అభివృద్ధి చెందుతున్న కాలనీలలో రోడ్లు,కాలువలు నిర్మించాలి

### వీకర్ సెక్షన్ కాలనీలో స్మశానవాటిక ఏర్పాటుచేయాలి

### పార్క్ లు అభివృద్ధి చేయాలి:-కర్నూలు సిపిఎం న్యూ సిటీ కమిటీ

కల్లూరు మే 16 :- కల్లూరు అర్బన్ ప్రాంత వార్డులలో మంచినీటి సమస్య పరిష్కరించాలని,అభివృద్ధి చెందుతున్న కాలనీలలో రోడ్లు , కాలువలు నిర్మించాలని,వీకర్ సెక్షన్ కాలనీలో స్మశాన వాటికను ఏర్పాటు చేయాలని సిపిఎం న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కర్నూలు పర్యటనలో భాగంగా మునిసిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ కు వినతి పత్రం అందచేశారు.ఈ సందర్బంగా సిపిఎం న్యూ సిటీ కమిటీ కార్యదర్శి టి. రాముడు మాట్లాడారు.కల్లూరు అర్బన్ ప్రాంతంలోని వీకర్ సెక్షన్ కాలనీ,ముజఫర్ నగర్ , కల్లూరు,చింతలముని నగర్ , శరీన్ నగర్,కృష్ణానగర్ ప్రాంతాలలో గత 20 రోజులుగా మంచినీరు 3,4 రోజులకు ఒకసారి వస్తున్నాయని అన్నారు.ఆ వచ్చేనీరు కూడా ఎప్పుడు వస్తాయో ఎప్పుడు బంద్ అవుతాయో తెలియని పరిస్థితి వుంది.వచ్చే నీళ్ల కోసం ప్రజలు తమ పనులను మానుకుని ఎదురు చూస్తున్నారు.వేసవి ముగియడానికి ఇంకా 2 నెలల సమయం ఉ ఒదన్నారు. కర్నూలు కార్పోరేషన్ లో కల్లూరు అర్బన్ ప్రాంతం విలీనమై 20 సంవత్సరాలు కావస్తున్న 4 లక్షల జనాభకలిగి ఉన్న కల్లూరు ప్రాంతవాసులకు రోజు త్రాగు నీళ్లు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. రోజు త్రాగునీరు ఇచ్చేవిధంగా శాశ్వత పరిష్కారం కోసం 2వ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.అర్బన్ ప్రాంతం రోజురోజుకు విస్తరించి కొత్తకొత్త కాలనీలు ఏర్పడుతున్నాయి.కాని ఆకాలనీలలో రోడ్లు,డ్రైనేజి లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. కావున కొత్తగా విస్తరిస్తున్న కాలనీలలో రోడ్లు , నిర్మించాలన్నారు.అలాగే వీకర్ సెక్షన్ కాలనీ ప్రాంతంలో రూ.40 వేల జనాభా ఉందన్నారు. కాని ఆప్రాంతంలో ఎవరైనా చనిపోతే దహనసంస్కాలు చేయడానికి కనీసం స్మశానం కూడాలేదని అన్నారు.5 కిమీ దూరంలో వున్న కల్లూరుకు వచ్చి దహన సంస్కారాలు చేసే పరిస్థితి వుందన్నారు.కావునా మంత్రి కర్నూలు పర్యటనలో కాలనీ ప్రజలకు స్మశానానికి స్థలం కేటాయించి స్మశానం నిర్మించేందుకు కృషిచేస్తామని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.కల్లూరు అర్బన్ ప్రాంతాలలో అనేక పార్కు స్థలాలు వున్నాయి.కాని అవి నిరుపయోగంగా వున్నాయి. వాటికి అభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని మంత్రిని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు కె. సుధాకరప్ప,ఐద్వా నాయకురాలు శ్యామల, సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సి.గురుశేఖర్,కెవిపిఎస్ జిల్లా కమిటీ నాయకులు ఎస్. సత్యం,స్థానిక సభ్యులు వలి, తదితరులు పాల్గొన్నారు

# సివిల్ సప్లయ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తే పోరాటం తీవ్రతరం

కడప ప్రజా పంపిణీ వ్యవస్థలో కీలకంగా వ్యవహరిస్తున్న సివిల్ సప్లై ఆస్తులను తనఖా పెట్టి నిర్వీర్యం చేయవద్దని, హమాలీలకు ఉపాధి భద్రత కల్పించాలని ఏఐటియుసి జిల్లా జనరల్ సెక్రెటరీ ఎల్.నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు.సోమవారం స్థానిక మార్కెట్ యార్డ్ లోని సివిల్ సప్లై గోడౌన్ యందు హమాలీల కూలి రేట్లు పెంచాలని రాష్ట్రవ్యాప్తంగా సివిల్ సప్లయిస్ హమాలి వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ పిలుపులో బాగంగా పని బంద్ చేసి నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి,సివిల్ సప్లై హమాలి వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు యల్.నాగ సుబ్బారెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని 19 మండల స్టాక్ పాయింట్స్ యందు లోడింగ్, అన్ లోడింగ్ నిలుపుదల చేసి నిరసన కార్యక్రమాలు నిర్వహించారన్నారు.నిత్యావసర వస్తువుల ధరలు, డీజిల్, పెట్రోల్ ,గ్యాస్ ధరలు రోజువారీ పెరుగుతూనే ఉన్న హమాలీ కూలి రేట్లు రెండు సం గడచిన పెంచకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.నడుచుకుంటున్న కార్మికులకు న్యాయంగా రావాల్సిన పీఎఫ్ స్లిపులు,ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ ఇవ్వాల్సి ఉ ండగా హమాలీల పొట్టకోట్టడం తగదన్నారు.ప్రజా పంపిణీ వ్యవస్థలో నగదు బదిలీ పథకాన్ని తీసుకొచ్చి ఆహార భద్రత చట్టాన్ని తూట్లు పోడచకుండా,ఇటు హమాలీల భద్రతకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. సివిల్ సప్లై కార్పొరేషన్ అధికారులు యూనియన్ నాయకులతో చర్చించి న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్ర మంలో ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె సి బాదుల్లా,నగర కార్యదర్శి ఉద్దే. మద్దిలేటి,సివిల్ సప్లయిస్ హమాలి వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మురారి ,కోశాధికారి రమణ నాయకులు శ్రీకాంత్, నాగయ్య, ప్రతాప్ ,రాజశేఖర్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్డీతోసామాన్యుల నడ్డి విరుగుతోంది

నంద్యాల గతంలో రాష్ట్రంలో కాల్ మని వ్యవహారం కలకలం రేపిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం వరలా వడ్డీ పేరిట సామాన్య మధ్య తరగతి ప్రజలను లక్ష్యంగా చేసుకుని కొందరు అప్పులిస్తున్నారు. పట్టణాలతో పాటు పల్లె లకు కూడా తమ వ్యాపారాన్ని విస్తరించి ప్రజల ఆర్థిక అవసరాలను సొమ్ము చేసుకుంటున్నారు. కరోనా కారణంగా రెండేళ్లపాటు పనులు లేక సామాన్య మధ్య తరగతి ప్రజలు ఆర్థికంగా చితికిపోయారు. చెత్త ఆస్తి పన్ను విద్యుత్ ఛార్జీలు పెంపు తరచూ పెరుగుతున్న డీజిల్ పెట్రోల్ ధరలు ప్రభావంతో నిత్యావసర సరుకుల ధరలు చుక్కలనంటుతున్నాయి. ఇంటిల్లిపాది రోజంతా కష్టపడి నా పూట గడవడమే కష్టంగా మారింది.

కుటుంబ పోషణ పిల్లల చదువులు వైద్య ఖర్చులు ఇతర అవసరాలకు చేతిలో చిల్లిగవ్వ లేక వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం నంద్యాల పట్టణంలో వారాల వడ్డీ వ్యాపారం జోరుగా సాగుతోందని తెలుస్తోంది . ఖాళీ ప్రాంసరీ నోటు రూ 20 వేల వరకు. ఆపై అయితే ఖాళీ ప్రాంసరీ నోటు చెక్కులు తీసుకుంటున్నారని తెలుస్తోంది . 5000, వేలకు 2000 వడ్డీ. పది వేలకు నాలుగు వేల వడ్డీ. చొప్పున అప్పు ఇస్తున్నారు. ఎంత మొత్తం తీసుకున్న అసలు వడ్డీ కలిపి భాగించగా వచ్చిన మొత్తాన్ని 28 వారాలుగా చెల్లించాలని షరతులు విధిస్తున్నారు. ఉదాహరణకు 5000 రూ. తీసుకుంటే వడ్డీ 2000 మొత్తం 7000 రూ. వారానికి 250 రూపాయల చొప్పున 28 వారాల పాటు వాయిదా పద్ధతిలో చెల్లించాలి. ఒకవేళ మధ్యలో కొన్ని వారాలు చెల్లించకపోతే అదనంగా వడ్డీ వేస్తున్నారు. సామాన్యుల నడ్డి విరుస్తున్న ఈ వ్యాపారం బాహాటంగా సాగుతున్న అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. తమకు బాధితులు ఎవరైనా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.

# ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు

### బెల్టుషాపులు నిర్వహిస్తే వారిని కఠినంగా శిక్షిస్తామని

### స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ ఐ

కౌతాళం బెల్టుషాపులు నిర్వహిస్తే వారిని కఠినంగా శిక్షిస్తామని అక్రమంగా మద్యం అమ్మినా రవాణా చేసిన అక్రమంగా తరలించిన వారిని వదిలేది లేదని జిల్లా ఆదేశాలు మేరకే ఈ తనిఖీలు చెప్పట్టమని ఎస్సై తెలిపారు. వారు మాట్లాడుతూ ఆదివారం అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం బాక్సలు మాన్వి నుండి గోతుల దొడ్డి మరియు హల్వి గ్రామ లకు తరలిస్తున్న ఈరన్న మరియు అతని అనుచరులు నాగరాజ్ ,నగేష్, రమేష్ ,షేక్ ఇజాజ్ లను మరలి గ్రామ శివారులో పట్టుకొని వారి వద్ద నుండి 20 కర్ణాటక మద్యం బాక్సలు 2 మోటార్ సైకిల్ 2 సెల్ ఫోన్లు సీజ్ చేసి రిమాండ్ కు తరలించడం అయినదని మరియు మద్యం అమ్మిన కర్ణాటకకు చెందిన బసప్ప మీద కేసు నమోదు చేశామని తెలిపారు.

# మహేశ్ సినిమాలో అలాంటివి ఊహించగలమా..?



సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన 'సర్కారు వారి పాట' సినిమా గురువారం ప్రపంచ వ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదలైంది. అయితే పరశురాం పెట్లా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం.. డివైడ్ టాక్ తెచ్చుకుంది. మహేష్ స్టార్ డమ్ ఈ మూవీని ఎక్కడి దాకా తీసుకెళ్తుంది? ఎంత వసూళ్ళు చేస్తుంది? అనేది పక్కన పెడితే.. ఇందులో కొన్ని డైలాగ్స్ మరియు సీన్స్ పై అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి.సినిమాలో సుబ్బరాజును మహేష్ చికాకు పెట్టే ఓ సీక్వెన్స్ ను చిత్రీకరించారు. అందులో ఒక సీన్ కామెడీ కోసం చేసినప్పటికీ.. అది నవ్వు పుట్టించలేదు సరికదా.. స్క్రీన్ పై వెగటుగా కనిపించిందని కామెంట్స్ వస్తున్నాయి. దర్శకుడు తెలివిగా ఆ సన్నివేశానికి సంబంధించిన ఎలాంటి విజువల్స్ ను చూపించలేదు కానీ.. అదే విషయాన్ని సినిమాటిక్ గా తెలియజేసారు.అయితే ఈ సన్నివేశం మహేష్ బాబు లాంటి స్టార్ హీరో స్థాయిని కించపరిచేలా ఉందని సోషల్ మీడియాలో కామెంట్స్ వస్తున్నాయి. మహేష్ సినిమాల్లో ఇలాంటి సీన్స్ ఉంటాయని అనుకోలేదని.. ఇది ఒక విధంగా సుబ్బరాజు పాపులారిటీని కూడా అగౌరవపరుస్తుందని అంటున్నారు. మహేశ్ తన ఇమేజ్ ని అనుభవాన్ని పరిగణనలోకి తీసుకొని.. ఇలాంటి సీన్ చేయకుండా ఉండాల్సిందని నెటిజన్లు అభిప్రాయ పడుతున్నారు.అలానే కీర్తి సురేష్ ను మహేశ్ బాబు కొట్టే సీన్ పై కూడా కొందరు ఫీమేల్ ఆడియన్స్ అభ్యంతరం తెలుపుతున్నారు. అయితే అక్కడ కీర్తి ముందు వెన్నెల కిషోర్ ని కొట్టడమే కాకుండా.. నిన్ను కూడా కొడతా అని వార్నింగ్ ఇచ్చింది కాబట్టి.. మహేశ్ అలా చేయడంలో తప్పుమీ లేదని మరికొందరు అంటున్నారు. ఇక సినిమాలో 'వయాగ్రా' డైలాగ్ మరియు 'ఎందుకంటే.. వాడిది మరీ.. పెద్ద..' అంటూ మహేష్ చెప్పే డబుల్ మీనింగ్ డైలాగ్ పై పలువురు పెదవి విరుస్తున్నారు. వీటిపై అభిమానుల నుంచి ఎలాంటి అభ్యంతరం లేకపోయినా.. ఎప్పుడూ డిగ్నిటీగా ఉండే మహేష్ నోటి నుంచి ఇలాంటి డైలాగ్స్ ఊహించలేదని ఓ వర్గం ఆడియన్స్ అంటున్నారు.ఏదేమైనా మహేశ్ బాబు లాంటి అగ్ర హీరో తన సినిమాల్లోని ప్రతి సన్నివేశాన్ని - డైలాగ్ ను చాలా జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే స్టార్ హీరోల సినిమాలు జనాలను ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. ఇతర నటీనటులతో పోలిస్తే బిగ్ స్టార్స్ మరింత జాగ్రత్తగా ఉండటం.. మంచి కంటెంట్ తో ముందుకు రావడం అనేది అదనపు బాధ్యత అని చెప్పాలి.హీరోలు అలా వ్యవహరించకపోతే అది సమాజంలో వారికున్న గౌరవాన్ని ప్రభావితం చేయడమే కాకుండా.. నేటి తరం ప్రేక్షకులపై అనవసరమైన నెగెటివ్ అభిప్రాయాన్ని కూడా సృష్టిస్తుంది. 'సర్కారు వారి పాట' సినిమాకు వచ్చిన అభ్యంతరాలను దృష్టిలో పెట్టుకొని రాబోయే చిత్రాలలో మహేశ్ అలాంటి సన్నివేశాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సినీ అభిమానులు ఆశిస్తున్నారు.

# 'సర్కారు వారి పాట' పై ప్రభాస్ రివ్యూ..?

'సరిలేరు నీకెవ్వరు' సినిమా తర్వాత దాదాపు రెండున్నరేళ్ల గ్యాప్ తర్వాత సూపర్ స్టార్ మహేష్ బాబు.. ఇప్పుడు "సర్కారు వారి పాట" వంటి పక్కా కమర్షియల్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు.గత కొంతకాలంగా సబ్టిల్ రోల్స్ కే పరిమితమైన మహేశ్.. ఈసారి జోవియల్ గా ఉండే మాస్ క్యారక్టర్ తో మెప్పించారు. పరశురాం దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి తొలి రోజు మిశ్రమ స్పందన వచ్చింది.అయినప్పటికీ టాక్ తో సంబంధం లేకుండా మంచి ఓపెనింగ్స్ రాబట్టినట్లు నివేదికలు వస్తున్నాయి. ఇదిలా ఉంటే 'సర్కారు వారి పాట' చిత్రాన్ని యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ గురువారం రాత్రి చూసినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.సాఎఖ సినిమా డార్లింగ్ కు చాలా బాగా నచ్చిందని చెప్తున్నారు. అలాగే ఇందులో మహేష్ బాబు కామెడీ టైమింగ్ మరియు ఫైట్స్ కూడా నచ్చాయని.. వాటిని బాగా ఎంజాయ్ చేశానని ప్రభాస్ తన సన్నిహితులతో చెప్పినట్లుగా నెట్టింట వార్తలు వస్తున్నాయి.ఇందులో నిజమెంతో తెలియదు కానీ.. మహేష్ బాబు నటించిన 'సర్కారు వారి పాట' చిత్రానికి ప్రభాస్ రివ్యూ ఇవ్వడమనేది ఇద్దరి మ్యూచువల్ ఫ్యాన్స్ ను కచ్చితంగా ఖుషీ చేస్తుందని చెప్పవచ్చు.బయటకు కనిపించకపోయినా నిజానికి ప్రభాస్ మరియు మహేష్ చాలా సాన్నిహిత్యంగా ఉంటారు. రెగ్యులర్ గా మీట్ అవ్వకపోయినా.. కలిసినప్పుడు మాత్రం ఒకరిపై ఒకరు అభిమానాన్ని చాటుకుంటుంటారు.ప్రభాస్ నటించిన 'వర్షం' ఆడియో ఫంక్షన్ కు మహేష్ చీఫ్ గెస్టుగా హాజరైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత అనేక సందర్భాల్లో వీరిద్దరూ ఒకే వేదికను పంచుకున్నారు. ఇటీవల ఏపీ సీఎం జగన్ తో భేటీకి ఒకే ఫ్లైట్ లో కలిసి వెళ్లారు.సమావేశంలో పక్కపక్కనే కూర్చున్న మహేష్ - ప్రభాస్.. ఆ తర్వాత మీడియాతో మాట్లాడుతున్న సమయంలో వారిద్దరి బాండిగ్ చూసి ప్రతి ఒక్కరూ స్టన్ అయ్యారు. ఇద్దరూ చాలా క్లోజ్ గా ఉండడాన్ని చూసి అభిమానులు మురిసిపోయారు.స్టార్ హీరోలిద్దరూ కలిసి ఒక మల్టీస్టారర్ చేసి ఒకే ఫ్రేమ్ లో కనిపిస్తే బాక్సాఫీస్ రికార్డ్స్ అన్నీ బద్దలు అవడం ఖాయమని కామెంట్స్ చేసారు. మహేష్ బాబు - ప్రభాస్ కలిసి ఉన్న ఫోటోలు ఆ మధ్య చాలా రోజులపాటు నెట్టింట సందడి చేశాయి.ఇక సినిమాల విషయానికొస్తే.. పాన్ ఇండియా స్టార్ గా ఎదిగిన ప్రభాస్ ప్రస్తుతం వరుసగా భారీ సినిమాలు చేసుకుంటూ వెళ్తున్నారు. సాఎఖ తర్వాత త్రివిక్రమ్ తో చేయనున్న మహేశ్.. ఇదే క్రమంలో రాజమౌళి దర్శకత్వంలో పాన్ ఇండియా మూవీ మొదలు పెట్టనున్నారు.



# స్పెషల్ షాట్స్ తో ట్రిపుల్ ఆర్ ఓటీటీ రచ్చ రచ్చేనా?

యావత్ దేశ వ్యాప్తంగా వున్న ప్రేక్షకులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన భారీ ప్రెస్టేజియస్ మల్టీస్టారర్ మూవీ ట్రిపుల్ ఆర్ ఎట్టకేలకు ఇటీవల ప్రేక్షకుల ముందుకొచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా అత్యంత భారీ స్థాయిలో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద తన ప్రభంజనాన్ని కొనసాగిస్తూ రికార్డుల మోత మోగించింది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ తొలిసారి కలిసి నటించిన భారీ మల్టీస్టారర్ కాడంతో దేశ వ్యాప్తంగా వున్న సినీ ప్రియులు ఈ మూవీ కోసం ఆసక్తిగా ఎదురుచూశారు.మార్చి 25న విడుదలైన ఈ చిత్రం సంచలనాలు సృష్టిస్తూ విడుదలైన అన్ని భాసల్లో రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టింది. దక్షిణాది చిత్రాల సత్తాని మరోసారి యావత్ ప్రపంచానికి చాటి సౌత్ సినీ ఇండస్ట్రీకి సరికొత్త ఊపునిచ్చింది. పాన్ ఇండియా వైడ్ గా భారీ వసూళ్లని రాబట్టి వెయ్యి కోట్లకు మించి వసూళ్లని రాబట్టిన చిత్రాల క్లబ్ లో చేరింది. ఇదిలా వుంటే గత కొన్ని రోజులుగా ఈ సినిమా ఓటీటీలో స్ట్రీమింగ్ ఎప్పుడన్నది ఆసక్తికరంగా మారింది.దీంతో చాలా మంది ప్రేక్షకులు ఓటీటీలో మరిన్ని కొత్త సీన్ లతో సినిమా స్ట్రీమింగ్ కానుందని తెలియడంతో ఆ రోజు కోసం ఆసక్తిగా ఎదురుచూడటం మొదలు పెట్టారు. వారి నీరీక్షణకు ఫుల్ స్టాప్ పెడుతూ 'ట్రిపుల్ ఆర్' ఓటీటీ రిలీజ్ డేట్ ని ప్రకటిస్తూ తాజాగా కొత్త ట్రైలర్ ని విడుదల చేశారు. ఈ మూవీ జీ5 లో స్ట్రీమింగ్ కాబోతున్న విషయం తెలిసిందే. హిందీ మినహా దక్షిణాది భాషల్లో ఈ మూవీ స్ట్రీమింగ్ కాబోతోంది. మే 20న ఈ చిత్రాన్ని స్ట్రీమింగ్ చేస్తున్నట్టు జీ5 వెల్లడించింది.ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం సరికొత్త హంగులతో ముస్తాబు చేసిన 'ట్రిపుల్ ఆర్' ట్రైలర్ ని విడుదల చేశారు. ఒరిజినల్ ట్రైలర్ లోని పలు సన్నివేశాలతో పాటు సినిమాలో లేని స్పెషల్ షాట్స్ తో ట్రైలర్ ని విడుదల చేయడం ఆకట్టుకుంటోంది. అడవిలో చిన్న తండా...అందులో చిరునవ్వులు పూయించే చిన్నారిని చూపిస్తూ ప్రారంభమైన ట్రైలర్ లో రామ్ - భీమ్ కలుసుకోవడం...వాళ్ల మధ్య పోరాటం..వాళ్లిద్దరూ కలిసి బ్రిటీష్ వారిపై పోరాటం చేయడం..ఇలా సినిమాలో లేని పవర్ ఫుల్ సీన్ లని ట్రైలర్ లో చూపించారు.అంతే కాకుండా 'ప్రతి తూటా మీద చచ్చేవాడి పేరు రాసుంటుంది. ప్రతి తుపాకీ మీదా పేల్చేవాడి పేరుంటుంది. యుద్ధాన్ని వెతుక్కుంటూ ఆయుధాలు వాటంతట అవే వస్తాయ్.. వంటి పవర్ ఫుల్ డైలాగ్ లతో ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ట్రైలర్ ని బట్టి చూస్తుంటే ఓటీటీ వెర్షన్ లో సినిమాలో చూపించని చాలా సన్నివేశాలని చూపించబోతున్నారని స్పష్టమైంది. దీంతో చాలా మంది అంట థియేటర్లలో సినిమాని చూడని వారు చూసిన వారు కూడా ఓటీటీ వెర్షన్ కోసం విరగబడటం ఖాయంగా కనిపిస్తోంది.




# ఢిల్లీ, పంజాబ్ మధ్య బిగ్ ఫైట్.. తుది జట్లు ఎలా ఉండబోతున్నాయంటే..!

ఐపీఎల్ 2022 సీజన్లో ఇవాళ (మే 16) మరో బిగ్ ఫైట్ జరుగనుంది. ముంబైలోని డీవై పాటిల్ స్టేడియం వేదికగా ఢిల్లీ, పంజాబ్ జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ మ్యాచ్ రాత్రి 7:30 గంటలకు ప్రారంభం కానుంది. నిన్న (మే 15) రాజస్థాన్ చేతిలో లక్నో ఓడిపోవడంతో.. ప్లేఆఫ్స్ ఈక్వేషన్స్ రసవత్తరంగా మారాయి. గుజరాత్ ఇప్పటికే ప్లేఆఫ్స్ బెర్తును ఖరారు చేసుకోగా మిగిలిన మూడు స్దానాల కోసం ఆరు జట్ల (రాజస్థాన్, లక్నో, ఆర్సీబీ, ఢిల్లీ, కేకేఆర్, పంజాబ్) మధ్య ఆసక్తికర పోటీ నెలకొంది. ఇక నేటి మ్యాచ్ విషయానికొస్తే.. పంజాబ్, ఢిల్లీ జట్లు ఇప్పటివరకు ఆడిన మ్యాచ్ల్లో చెరి 12 పాయింట్లు (12 మ్యాచ్ల్లో 6 విజయాలు) సాధించి పాయింట్ల పట్టికలో సమంగా ఉన్నాయి. అయితే పంజాబ్ (0.023)తో పోలిస్తే.. ఢిల్లీ (0.210) నెట్ రన్‌రేట్ కాస్త మెరుగ్గా ఉండటంతో ఆ జట్టు ఐదో స్థానంలో, పంజాబ్ ఏడో స్థానంలో ఉన్నాయి. ప్లే ?ఆఫ్స్‌కు చేరాలంటే ఇరు జట్లకు ఈ మ్యాచ్ అత్యంత కీలకం కానుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు 14 పాయింట్లతో ప్లే ఆఫ్స్‌కు మరింత చేరువ అవుతుంది.గత కొద్ది రోజులుగా టైఫాయిడ్‌తో బాధపడ్డ ఢిల్లీ డాషింగ్ ఓపెనర్ పృథ్వీ షా ఈ మ్యాచ్‌కు అందుబాటులోకి వచ్చాడు. అతను ఈ మ్యాచ్‌లో ఆడటం ఖాయంగా తెలుస్తోంది. ఇదే జరిగితే కేఎస్ భరత్‌పై వేటు పడే అవకాశం ఉంది. ఈ ఒక్క మార్పు మినహా గత మ్యాచ్‌లో రాజస్థాన్‌పై గెలిచిన జట్టునే డీసీ యధాతథంగా కొనసాగించవచ్చు. పంజాబ్ విషయానికొస్తే.. ఈ మ్యాచ్ కోసం మయాంక్ సేన ఎటువంటి మార్పులు చేసే అవకాశం లేదని తెలుస్తోంది. గత మ్యాచ్‌లో ఆర్సీబీపై గెలిచిన జట్టునే యధాతథంగా కొనసాగించే ఛాన్స్ ఉంది. ప్రస్తుత ఫామ్ ప్రకారం చూస్తే.. నేటి మ్యాచ్‌లో రెండు జట్లకు సమానమైన విజయావకాశాలు ఉన్నాయి. ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో విధ్వంసం సృష్టించిన బెయిర్ స్టో, లివింగ్‌స్టోన్ భీకరమైన ఫామ్‌లో ఉండగా.. బౌలర్లలో రబాడ, హర్‌ప్రీత్ బ్రార్, అర్షదీప్ సింగ్, రాహుల్ చాహర్, రిషి ధవన్‌లు అంచనాలకు మించి రాణిస్తున్నారు. ఢిల్లీ విషయానికొస్తే.. రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో మిచెల్ మార్ష్, డేవిడ్ వార్నర్‌లు రెచ్చిపోయి ఆడారు. వీరిద్దరు ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే పంజాబ్‌కు కష్టాలు తప్పకపోవచ్చు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190